ఆంధ్రజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

రేపటికల్లా వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నోడల్ అధికారుల సమావేశంలో కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), మే 10 : పోలింగ్ కేంద్రాల్లో 12వ తేదీ ఉదయానికల్లా వెబ్ కెమెరాల ఏర్పాటు పూర్తి చేయించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో నోడల్ అధికారులతో సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఒక్కొక్క నియోజకవర్గానికి నలుగురు అధికారులతో బృందాన్ని నియమించామని, ఈ ఎన్నికల నిర్వహణను పరిశీలించడానికి జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ శనివారం నుంచి పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ పూర్తయ్యే వరకు పనిచేస్తుందన్నారు. జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నియోజకవర్గాలకు ఎన్నికల సామగ్రి బయలు దేరే సమయం నుంచి ఓటింగ్ పూర్తయ్యేవరకు పూర్తి స్థాయిలో అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు పనిచేస్తున్నాయా? లేదా? అనే విషయాలు పరిశీలించాలన్నారు. పోలింగ్ సిబ్బంది సంక్షేమాన్ని కూడా పట్టించుకోవాల న్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను మార్చాల్సి వస్తే వెంటనే సంబంధిత నోడల్ ఆఫీసులకు తెలియచేయాలన్నారు. ఈ సమవేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హా, నోడల్ అధికారులు ఎస్ రాజు, టీ బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : మైపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన వేమిరెడ్డి దంపతుల సభలో పాల్గొన్న టీడీపీ, జనసేన శ్రేణులు

నేటితో ప్రచారాలు

పరిసమాప్తం

నెల్లూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సంగ్రామం తుదిదశకు చేరుకుంది. ప్రధాన ఘట్టమైన ఎన్నికల ప్రచారాలు శనివారంతో ముగియనున్నాయి. గడిచిన 50 రోజులకుపైగా చెవులు తూట్లు పొడిచేలా వివిధ శబ్దాలకు నేటి సాయంత్రం 6 గంటలతో తెరపడనుంది. ఇక తుదిపోరు పోలింగ్ మాత్రమే మిగిలి ఉంది. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారాలను ముగించాల్సి ఉంది. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రక టించింది. షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచే ప్రధాన పార్టీలు తమ ప్రచారాన్ని ప్రారంభించాయి. ఇక అభ్యర్థులను ఖరారు చేసిన తరువాత ఆ ప్రచారాలు ఊపందుకున్నాయి. 2019తో పోలిస్తే ఈదఫా ప్రచారం సుదీర్ఘంగా సాగింది. నాడు మొదటి విడతలోనే ఎన్నికలు జరగడంతో పట్టుమని నెలరోజులు కూడా సమయం దొరకలేదు. ఈసారి నాల్గవ విడ తలో ఎన్నికల జరగడం, ఎక్కువ సమయం దొరకడంతో ప్రధాన పార్టీ లన్నీ ఓటర్ల గడపలు తొక్కాయి. ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచా రాలు ముమ్మరంగా చేసుకున్నాయి.

● అధినేతల రాక

ప్రధాన పార్టీల అధినేతలు జిల్లాలో ఎన్నికల ప్రచారాలు నిర్వహించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాలుగు దఫాలుగా అన్ని నియోజకవర్గాల్లో పర్యటించారు. తొలుత కావలి, ఉదయగిరి, అనంతరం సర్వేపల్లి, ఆత్మకూరు, కోవూరు, చివరివిడతలో నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఒకేఒక్కసారి జిల్లాకు వచ్చారు. చంద్రబాబు నాయుడుతో కలిసి జిల్లా కేంద్రంలో రోడ్‌షో నిర్వహించి, బహిరంగ సభలో మాట్లాడారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కందుకూరు, కావలి, నెల్లూరు నగరంలో మూడు దఫాలుగా ఎన్నికల ప్రచారాలు నిర్వహించారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల కోవూరులో పర్యటించారు. వీరేగాక పలు రాజకీయపార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా వారివారి స్థాయిలో జోరుగా ప్రచారాలు చేపట్టారు. నేటి సాయంత్రంతో ఎన్నికల ప్రచారాలు తెరపడనుండటంతో అభ్యర్థులంతా పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టారు. ఇప్పటి వరకు పడిన కష్టాన్ని ఓటు రూపంలో మలచుకునుందుకు ఎవరి ప్రయత్నాలు వారు జోరుగా సాగిస్తున్నారు.

మద్యం దుకాణాలు, బార్లు మూత

● నేటి రాత్రి 7 నుంచి, 13వ తేది రాత్రి 7వరకు

నెల్లూరు (క్రైం) : ఎన్నికల నిర్వహణ దృష్ట్యా శనివారం రాత్రి 7 గంటల నుంచి పోలింగ్ పూర్తయిన తర్వాత 13వ తేదీ రాత్రి వరకు జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లు మూసివేయనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కె నాగమల్లేశ్వరరెడి ఒక ప్రకటనలో తెలి పారు. ఈ 48 గంటల వ్యవధిలో మద్యం దుకాణాల సిబ్బంది, బార్ల యాజమాన్యం, ఇతరులు మద్యం అమ్మకాలు జరిపినా, అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 0861-2331159 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.4

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

నెల్లూరు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. కావలి				
2. ఆత్మకూరు				
3. కోవూరు				
4. నెల్లూరు (సిటీ)				
5. నెల్లూరు (రూరల్)				
6. సర్వేపల్లి				
7. గూడూరు (ఎస్సీ)				
8. సూళ్లూరుపేట (ఎస్సీ)				
9. వెంకటగిరి				
10. ఉదయగిరి				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : నెం.91, ఉడ్‌కాంప్లెక్స్, అయ్యప్పగుడి దగ్గర, వేదాయపాలెం, నెల్లూరు-524004.



ప్రచార వాహనంతో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓటు వినియోగించుకోవాలంటూ ప్రచారం

అనంతసాగరం, మే 10: ఓటు ఉన్న ప్రతిఒక్కరూ తమహక్కును వినియోగించుకోవాలంటూ ప్రచార వాహనంతో అధికారులు శుక్రవారం పట్టణంతో పాటు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశాలతో చేపట్టిన కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కసారి గెలిపిస్తే పుట్టినగడ్డ రుణం తీర్చుకుంటా !

- టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్
- కలిగిరిలో రెండోరోజూ కొనసాగిన ప్రచారం

కలిగిరి, మే 10: నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇంటి బిడ్డగా సేవచేసుకుంటూ పుట్టినగడ్డ రుణం తీర్చుకుం టానని కాకర్ల సురేష్ తెలిపారు. గురువారం పెదఅన్నలూరు, కమ్మవా రిపాలెం, వెలగపాడు, క్రాకుటూరు, కుమ్మరకొండూరు, అయ్యపరెడ్డి పాలెం, పెదకొండూరు, పెద్దపాడు, పోలంపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కలిగిరి, కమ్మవారిపాలెంలో ప్రజలు కాకర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగు,సాగు నీరు సమస్యలను పరిష్కరించడంతో పాటు, పరిశ్రమల నిర్మా ణానికి కృష చేసి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. తమ అధినాయకుడు చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోకు ప్రతిగ్రామంలో అపూర్వ స్పందన లభిస్తుందన్నారు. అక్కచెల్లెమ్మలు, అవ్వతాతలు, యువతతో పాటు ఉద్యోగులు కూడా వైసీపీ ప్రభు త్వాన్ని గద్దె దింపడానికి కసిగా ఉన్నారని చెప్పారు. 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం కలిగిరిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

సీతారామపురం: మండలకేంద్రంలోని కోటవీధి, అల్లికవీధి, కురవ వీధి, కంసలివీధిలో శుక్రవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ జెడ్పీటీసీ కలివెల జ్యోతి నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. 13న జరిగే పోలింగ్‌లో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీతోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. పార్టీ వస్తే చిన్న, సన్నకారు రైతులు, మహిళలు, విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్లు, కరపత్రాలను పం పిణీ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం సీఎంగా చంద్రబాబునాయుడుని గెలిపించుకోవాలన్నారు. కార్య క్రమంలో షేక్‌బాబు, తోట మాల్యాద్రి, వార్డు మెం బర్ తోట మనోజ్, బాష, బండి మధు, తోట నవీన్, పి.సురేష్ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: అర్లపడియకు చెందిన 20వైసీపీ కుటుంబాలు వింజమూరు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ పార్టీ కండు వాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే స్థానిక పార్టీ కార్యాల యంలో కొట్టాలప ల్లికి చెందిన గడ్డం రామానాయుడు తన అనుచరు లతో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

వింజమూరు: గుండెమడకలలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచలబాబుయాదవ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రచారం నిర్వహించారు. వీరి వెంట ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేఖ పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ప్రతిఒక్కరూ టీడీపీకి ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామస్థులను కోరారు. కార్యక్రమంలో నాయకులు అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, బుర్రల శ్రీనివాస్‌యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాకర్లకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కలిగిరి పట్టణ ప్రజలు



వింజమూరు: ప్రచారంలో కాకర్ల సురేఖ, టీడీపీ నాయకులు



అర్లపడియలో పార్టీలో చేరిన వారితో టీడీపీ నాయకులు



సీతారామపురం: పథకాల క్యాలెండర్లను పంపిణీ చేస్తున్న మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి

కలువాయి సమస్యలపై ప్రత్యేక దృష్టి

వెంకటగిరి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ

కలువాయి, మే 10 : మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. అంతకుముందు సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడ నుంచి పడమటి వీధివరకు రోడ్‌షో సాగింది. టీడీపీ, జనసేన, బీజేపీ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడారు. మండల ప్రజలు నాపైన చూపుతున్న ఈ అభిమానికి రుణపడి ఉంటానన్నారు. టీడీపీ అధికారంలోనికి వచ్చిన వెంటనే కలువాయి మండల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కా రానికి కృషి చేస్తానన్నారు. వైసీపీ పాలనలో ఒక అభివృద్ధి పని జరగలేదన్నారు. మన బిడ్డలు భవిష్యత్తు బాగుపడాలంటే టీడీపీ అధికారంలోని రావాలన్నారు. 13న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, మాజీ స ర్పంచ్ చల్లా ఇందిర, చల్లా రఘురామిరెడ్డి, చల్లా బుజ్జిరెడ్డి, గ డ్డం కిషోర్‌రెడ్డి, ఏ.వేణుగోపాల్‌రెడ్డి, జగదల్‌నాయుడు, గూడూ రు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కలువాయిలో ఉత్సాహంగా సాగిన టీడీపీ శ్రేణుల ర్యాలీ



ప్రజలకుఅభివాదం చేస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

ఐదేళ్లలో వైసీపీ చేసిందేమి లేదు : ఆనం



సంగం: పండ్లతో చేసిన పూలమాలతో ఆనంకు స్వాగతం పలుకుతున్న నాయకులు

సంగం, మే 10: ఆత్మకూరులో పదేళ్ల కిందట తాను చేసిన అభివృద్ధే తప్ప వైసీపీ అధికారంలోకి వచ్చాక పాలకులు ఎలాంటి అభివృద్ధి చేయలేదని కూటమి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అన్నా రు. శుక్రవారం దువ్వూరు, గాంధీజన సంఘం, పెరమన గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు ఘన స్వాగ తం పలికారు. ముస్లిం, మైనార్టీలకు టీడీపీ హయాంలో చేపట్టిన విదేశీ విద్య, దుల్హాన్ పథకాన్ని వైసీపీ ర ద్దు చేసిందన్నారు. ముస్లిం 4శాతం రిజర్వేషన్ కాపాడింది టీడీపీయే అన్నారు. 13న జరిగే పోలింగ్‌లో రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేసి తనను, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆనం కుమార్తె ఆనం కైవల్యారెడ్డి మున్సిపాల్టీ పరిధిలోని తోటవీధి, నాగేంద్రపురం, కంది వీధి ప్రాంతాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించా రు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి.వెంకటర మణమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

- **టీడీపీలో చేరిన ఇందూరు**

ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి తన అనుచరులతో కలిసి వైసీపీని వీడి శుక్రవారం రాత్రి తెలుగుదేశంలో చేరారు. ఆనం వీరికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమం లో మెట్టుకూరు ధనుంజయరెడ్డి, తాళ్లూరు గిరినాయు డు, ఆనం మురళీరెడ్డి, కాటంరెడ్డి రవీంద్రా రెడ్డి, ఎంపీ పీ. కేతా వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

- **బీజేపీ నేతల ప్రచారం**

ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ఆనం, వేమిరెడ్డిలను గెలిపించాలని బీజేపీ నేతలు జేఆర్‌పేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, కరటంపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ పేట: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం కావాలియడవల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అబ్బూరి రమేష్‌నా యుడు, గిరినాయుడు, ధనుంజయరెడ్డి, కాటంరెడ్డి నర సింహారెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, మాల్యాద్రి నాయుడు, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

- మనుబోలు వద్ద బైక్ బోల్తా పడి ఇద్దరు..
- బుచ్చిలో ఆగి ఉన్న బైక్‌ను ఆటో ఢీకొని టీఎన్ఎస్‌యూ నేత మృత్యువాత
- మరొకరికి గాయాలు

మనుబోలు, మే 10: జిల్లాలోని బుచ్చి, మనుబోలు మండలాల్లో గురు, శుక్రవారాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. మరొకరు గాయపడ్డారు .వివరాల్లోకి వెళితే.. జాతీయరహదారిపై మనుబోలు పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బండి వేణు (18), చల్లా ఆకాష్(16) దుర్మరణం చెందారు. తిరుపతి జిల్లా పెళ్ళకూరు మండలం చిల్లకూరుకి చెందిన బండి చంద్రయ్యకు ఇద్దరు పిల్లలు. ఆయన కూలీ చేసుకుంటూ జీవిస్తున్నాడు. కుమారుడు వేణు ఇటీవల ఇంటర్ పూర్తి చేశాడు. నాలుగు రోజుల క్రితం కుమారుడికి సెకండ్ హ్యాండ్ బైక్ తీసిచ్చాడు. బైక్‌కు కట్టాల్సిన డబ్బులు, పేరు మార్పు కోసం వేణు చిల్లకూరుకి చెందిన తన స్నేహితుడు చల్లా ఆకాష్‌ను తీసుకుని నెల్లూరుకు వచ్చాడు. పని కాకపోవడంతో మధ్నాహ్నం రెండు గంటల సమయంలో నెల్లూరు నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మనుబోలు వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీని అధిగ మించబోయి ఎడమ పక్కకు రాగా, సర్వీసురోడ్డు స్టాఫ్ బోర్డును ఢీకొని బైక్ బోల్తా పడింది. ప్రమాద స్థలంలోనే తల ఛిద్రమై వేణు మృతి చెందాడు. ఆకాష్ తీవ్రగాయాలతో రోదిస్తుండగా 108లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకి తరలించారు. చికిత్స పొందుతూ ఆకాష్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు. ఇద్దరు యువకుల మృతితో చిల్లకూరు వడ్డి పాళెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులంతా గూడూరు ఆసుపత్రి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.



ప్రమాదస్థలంలో వేణు మృతదేహం



వేణు (ఫైల్)



తీవ్ర గాయాలతో చల్లా ఆకాష్

- **బుచ్చిలో టీఎన్ఎస్‌యూ నేత మృతి**

బుచ్చిరెడ్డిపాళెం: ఆగి ఉన్న బైక్‌ను ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో టీఎన్ఎస్‌యూ నేత కొప్పోలు మహేష్ (35)మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి బుచ్చిలోని ఓ ఫంక్షన్ హాలు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, గురువారం రాత్రి టీడీపీ కార్యాలయం నుంచి ఇంటికి వెళ్లేందుకు స్నేహితుడు షాన్‌వాజ్‌ను బైక్‌లో రమ్మని మహేష్ ఫోన్ చేశాడు. షాన్‌వాజ్ వచ్చి బైక్‌లో మహేష్‌ను ఎక్కించుకుని బయలుదేరుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టి బోల్తాకొట్టింది. ఈప్రమాదంలో బైక్‌పై ఉన్న వారిద్దరూ కిందపడ్డారు. పెద్దగా గాయాలు లేకపోవడం తో ఇద్దరిని స్థానికులు పైకిలేపి ఆటోడ్రైవర్‌తో మాట్లాడి పంపించేశారు. మహేష్ వెంటనే తన తమ్ముడికి సమాచారమిచ్చి షాన్‌వాజ్‌తో కలిసి బుచ్చి ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. ఈలోపు మహేష్ తమ్ముడు శ్రీకాంత్ ఆసుపత్రికి వచ్చాడు. అక్కడ చికిత్స చేయించుకుని బయటకు వచ్చేలోపు మహేష్‌కు బాధ తీవ్రమైంది. అక్కడి నుంచి బుచ్చిలోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు చేస్తుండగా పరిస్థితి విషమించడంతో అంబులెన్స్‌లో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మహేష్ మృతితో గొల్లపాళెంలో విషాదం నెలకొంది. మృతుడికి ఏడు నెలల గర్భవతిగా ఉన్న భార్య, ఐదేళ్ల పాప ఉన్నారు. కాగా, మహేష్ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, కోవూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుచ్చి పెద్దూరులోని మృతుడి నివాసానికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ. 10లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు.



కొప్పోలు మహేష్ (ఫైల్)

సోమశిల డ్యాంలో సముద్రపు చేపలు

అనంతసాగరం : సోమశిల జలాశయంలో అరుదైన సముద్రపు చేప జాలర్లకు చిక్కుతున్నాయి. నలుపు, బంగారుపు వర్ణం కలిగి నలుపు, తెలుపు చుక్కలు కలిగిన చేప ఇది. వీటిని చుక్కచేప అంటారని, అత్యంత పోషకాలు కలిగిన ఈ చేప కేజీ రూ.150 వరకు విక్రయిస్తున్నారు.



జగన్‌కు తొత్తుగా పోలీసు వ్యవస్థ

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్డీ విల్సన్

కావలి, మే 10 : రాష్ట్రంలో పోలీసులు జగన్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి ఆర్డీ విల్సన్ పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలీసు బాస్‌లుగా ఉన్న రాజేంద్రనాథ్‌రెడ్డి, రామానుజనేయుల సారథ్యంలో జరిగిన దుర్మార్గాలపై విచారణ చేప ట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఛీప్ సెక్రటరీ కూడా వైసీపీకి తొత్తుగా ఉన్నందున ఆయనపై కూడా ఎన్నికల కమిషన్ వేటు వేస్తేనే ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోగలరన్నారు. కావలి పట్టణంలో నిర్మించిన అమృత్ పథకం పైలాన్‌ను కావలి ఎమ్మెల్యే సమక్షంలో అప్పటి కావలి డీఎస్పీ సహకారంతో ధ్వంసం చేశారని, దానికి బాధ్యులపై పోలీసులు నేటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. బీజేపీ పాలనలో ముస్లిం, క్రిష్టియన్లకు ఎలాంటి ఇబ్బందులు జరగలేదన్నారు. ఓట్ల కోసం వైసీపీ నేతలు మైనార్టీలను రెచ్చగొడుతున్నారని, వాటిని నమ్మ వద్దన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కలయికతో రాష్ట్రానికి స్వర్ణయుగమన్నారు.

- **వైసీపీకి ఓటు వేస్తే ..**

కబ్జా కోరు, అవినీతిపరుడైన కావలి ఎమ్మెల్యేకు ఓటు వేస్తే మన ఆస్తులు మనకు దక్కవని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జీ.భరత్‌కుమార్ యాదవ్ తెలిపారు. కావలి ఎమ్మెల్యే కూడా నీతినిజాయితీలను గురించి మాట్లాడటం దెయ్యాలు, వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. కావలిలో పైరాలు, నేరాలు, దోపిడీలు, దుర్మార్గాలు, దాడులు చేసింది, చేయించింది ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కాదాని ప్రశ్నించారు. ఆయన అరాచకాలకు వ్యాపారవర్గాలు హడలిపోతున్నాయన్నారు. నాపైనే హత్యయత్నంకు పథకం వేశారన్నారు. వైసీపీ అభ్యర్థుల అవినీతి చరిత్ర అందరికీ తెలుసని, టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన కావ్య క్రిష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేంలో బీజేపీ నేతలు అంచిపాకల కమల, సీసీసీ సత్యం, కంచర్ల మురళి, కే.బ్రహ్మానందం, మందా కిరణ్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డి గ్రాఫ్ పడిపోయింది : మేకపాటి

కలిగిరి, మే 10: నా గ్రాఫ్ పడిపోయిందని, అందుకే టికెట్ ఇవ్వనన్న.. ముఖ్యమంత్రి నీ గ్రాఫ్ పడిపోయింది చూసుకో..దానికి తగిన శాస్తి చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.. మార్పు అవసరమని ప్రజలు నిర్ణయించుకున్నారు అని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు. కలిగిరిలో శుక్రవారం టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జగన్ ప్రజలతో వ్యాపారం మాత్రమే చేశాడన్నారు. ఆయన, ఆయన బృందం రాష్ట్రాన్ని కొల్లగొట్టారన్నారు. పాలన చేతకాని వాడి చేతుల్లో రాష్ట్రం ఐదేళ్లలో అధోగతి పాలైందన్నారు.

బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం

లింగసముద్రం, మే 10 : లింగసముద్రం, తాతాహోటల్ పాలెంతాలలో బీజేపీ నాయకులు కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని బీజేపీ సమన్వయకర్త ఘట్టమనేని హరిబాబు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె రాఘవయ్య, ఎం వరప్రసాదరావు, బుర్ర కోటేశ్వరరావు, మట్లె ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతత, పరిశ్రమల

స్థాపనే నా లక్ష్యం

- వేధింపులు లేని కావలి నా అభిమతం
- కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నెల్లూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లపాటు అట్టుడికిన కావలిలో ప్రశాంత వాతావరణం సృష్టించడం, పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే తన లక్ష్యమని కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

? తొలిసారి అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు, ఎలా ఉంది ఈ అనుభవం.

! పోటీ తొలిసారే కానీ ఎన్నికలు మాత్రం నాకు కొత్తకాదు. మండల పరిషత్ అధ్యక్షుడిగా నా ఎన్నికలను ఫేస్ చేశాను. మూడు దశాబ్దాలుగా ప్రతి ఎమ్మెల్యే ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాను. ఆ అనుభవం ఉంది. అయితే ఈసారి ఎన్నికలు చాలా డిఫరెంట్. చాలా హైప్ వచ్చేసింది. గతంలో గ్రామ స్థాయి నాయకులు చెబితే వినేవారు. ఇప్పుడు అలా కాదు. అభ్యర్థులే నేరుగా తమను కలవాలని, తమతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకోవాలని ప్రజలు కోరుకొంటున్నారు. అభ్యర్థులతో అటాచ్‌మెంట్ కోరుకొంటున్నారు. ఇది కొత్త పరిణామం. అలాగే కారణాలు ఫలానా అని చెప్పడం సరికాదు కానీ ప్రజల కోరికల్లో కూడా చాలా హైప్ వచ్చింది. ఇది కొత్త అనుభవం.

? గెలుపు పట్ల మీ ధీమా ఎలా ఉంది.


! ఏమాత్రం అనుమానం లేదు. భారీ మెజారిటీతో ప్రజలు నన్ను గెలిపిస్తున్నారు. మీకో విషయం తెలుసో లేదో, ఐదేళ్ల క్రితమే కావలి ప్రజలు మానసికంగా ఎన్నికలకు సిద్ధమైపోయారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, ఎప్పుడు ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిని ఓడిద్దామా అని కసిగా ఎదురుచూస్తూ ఉన్నారు. కాబట్టి ప్రజలు తెలుగుదేశం పార్టీని మానసికంగా ఎప్పుడో గెలిపించేశారు. ఇప్పుడు ఈవీఎం మిషన్ నొక్కడం ఒక్కటే మిగిలింది. కావలి ఎమ్మెల్యే, ఆయన అనుచరులు చేసిన అరాచకాలు, అన్యాయాలు అలాంటివి. వీటిని ప్రజలు మరిచిపోలేరు. ఓటుతో వైసీపీ నాయకులను తప్పకుం డా శిక్షిస్తారు.

? మీ గెలుపునకు దోహదపడే అంశాలు.

! చంద్రబాబు నాయుడు పరిపాలన పట్ల ప్రజలకు ఉన్న నమ్మకం. పవన్ కళ్యాణ్ పట్ల యువతకు ఉన్న అభిమానం. మోదీ దక్షతపైన విశ్వాసం. ఇవన్నీ నా గెలుపునకు దోహదపడే అం శాలు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యక ర్తల సమష్టి బలం, వ్యక్తిగతంగా నాకున్న పరిచయాలు, నా శక్తిమేరకు నేను చేసిన సేవా కార్యక్రమాలు. ఇవన్నీ నా గెలుపునకు దోహదప డే అంశాలు.

? కావలి అభివృద్ధి విషయంలో మీ ప్రాధాన్యతలు.

! కావలి వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం. ఇక్కడ మత్స్యపరిశ్రమ, వస్త్ర వ్యాపారాలకు కావలి పెట్టింది పేరు. కూటమి నాయకుల అందరి సహకారంతో ఈ రంగాలన్నింటినీ అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తా. మత్స్య పరిశ్రమను మరింత అభివృద్ధి చేస్తా. ఈ వైసీపీ పాలనలో మత్స్యవాడలు కనీస సౌకర్యాలు లేక అల్లాడిపోతున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యవాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తా. వస్త్ర వ్యాపారులకు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే వాతావరణం కల్పిస్తా. పోలీసు దాడులు, మామూళ్ల వేదింపులు లేకుండా చూస్తా.



కావలి సముద్ర తీర ప్రాంతం. ఇక్కడ పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉంది. నాలుగు పరిశ్రమలు తీసుకొస్తే వ్యాపారపరంగా కావలి ఇంకా అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంత యువకులకు ఉపాధి లభిస్తుంది. కావలిలో పరిశ్రమల స్థాపనకు మొదటి ప్రాధాన్యత ఇస్తా. కావలి మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యమైన రహదారులన్నీ బాగుచేయిస్తా. అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల లోటు లేకుండా చర్యలు తీసుకుంటా.

? కావలి ప్రజలకు మీరు చేసుకునే విన్నపం.

! కావలి నియోజకవర్గ ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. గడచిన ఐదేళ్ళ కాలంలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి చేసిన అరాచకాలు గుర్తుకు తెచ్చుకోండి. పిడికెడు మట్టి తోలుకోలేకపోయారు. మామూళ్లు ఇవ్వకుండా భూమి అమ్మలేకపోయారు. కొనలేకపోయారు. కప్పం కట్టకుండా ఏ వ్యాపారం చేయలేకపోయారు. పోలీసుల వేధింపులు చూశారు. దౌర్జన్యాలు చూశారు. ఐదేళ్లపాటు నరకం అనుభవించారు. మీ అందరికి నేను ఒక్కటే ప్రమాణం చేస్తున్నా. నన్ను గెలిపించండి. అరాచకం, అన్యాయం, బెదిరింపులు, వేధింపులు లేని కావలి నియోజకవర్గాన్ని మీకు కానుకగా ఇస్తా. స్వేచ్ఛగా జీవించే వాతావరణం సృష్టిస్తా. మీ సేవకుడిగా నిరంతరం అందుబాటులో ఉంటా.

ఎవరికి ఏ కష్టం వచ్చినా తోడబుట్టిన వాడిలా తోడుగా ఉంటా. ప్రజలకు భద్రత కల్పిస్తా. యువతకు ఉపాధి అవకాశాల బరోసా కల్పిస్తా. ఈ ఎన్నికలు రాష్ట్రానికి ఎంత ముఖ్యమో కావలికి అంతకన్నా ముఖ్యం. రాష్ట్రంలో రానున్నది చంద్రన్న పాలన. నన్ను అందులో భాగస్వామిని చేస్తూ ఆశీర్వదించండి. ఐదేళ్ల పాటు మీ కుటుంబ సభ్యుడిగా మీ కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటా. కావలిని అభివృద్ధి బాటలో నడిస్తా.

టీడీపీ సానుభూతిపరుల ఓట్లు గల్లంతు!

- ఓటరు స్లిప్పుల పంపిణీలో బయటపడుతున్న వైనం

కావలి, మే 10: రాజ్యాంగం అర్హులైన ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును కాలరాసే అధికారం వైసీపీ నేతలకు, అధికారులకు ఎవరిచ్చారని ఓటు హక్కును కోల్పోయిన బాధితులు ప్రశ్నిస్తున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని అక్రమాలతో ఎలాగైనా గెలవాలన్న ఆకాంక్షతో అధికారపార్టీ చేసిన అక్రమాలు కావలిలో వెలుగు చూస్తున్నాయి. పట్టణంలోని 28వ వార్డులో ఐదుగురు ఓటర్లు తమకు ఓటరు స్లిప్పులు రాలేదని శుక్రవారం బీఎల్వోకు ఫోన్ చేయగా ఆయన వచ్చి ఓటర్ జాబితాను పరిశీలించగా జాబితాలోనే వారి పేర్లు కనిపించలేదు. అలాగే 37వ వార్డులో ముగ్గురు ఓటర్ హెల్పింగ్ సెంటర్‌కు వెళ్లి వారి పాత ఓటర్ ఐడీ కార్డుతో పరిశీలించగా డిలెట్ చేసినట్లు చెప్పారు. అలాగే పాతూరుకు చెందిన ఒక ముఖ్య టీడీపీ నాయకుడి సతీమణి ఓటు కూడా కనిపించలేదని తెలిసింది. ఇవి కావలిలో మచ్చుకు కొన్ని మాత్రమే.. ఇలాంటివి పట్టణంలో ఎన్ని ఉన్నాయెూ తెలియాల్సి ఉంది. ఎంతో కాలంగా నివాసం ఉంటున్న వారి ఓట్లు లేవంటే దీంతో అధికారపార్టీ ఓటర్ల అక్రమాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. వైసీపీ సానుభూతిపురలకు షిఫ్టింగ్ పేరుతో దొంగ ఓట్లు నమోదు చేయడం, టీడీపీ సానుభూతిపరుల ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించిన సంఘటనలు ఓటర్ల జాబితా నిలువెత్తు సాక్ష్యాలుగా ఉన్నాయి. పోలింగ్‌రోజు ఓటర్లకు స్లిప్పులు ఇవ్వటానికి అసలు ఓటర్ లిస్ట్ బయట పెట్టగా ఇవన్నీ వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటి వరకు పబ్లిష్‌చేసిన ఓటర్‌లిస్టులు ప్రజలకు అందుబాటులో లేవని తెలుస్తోంది. ఇటీవల కావలి పట్టణంలో వెంగళరావునగర్, పాతూరులలో ఓటరులిస్ట్ చూస్తే వైసీపీ నేతలు షిఫ్టింగ్ పేరుతో ఒకే ప్రాంతంలో అదే ప్రాంతానికి దొంగ ఓట్లు చేర్పుకున్న విషయం తెలిందే. తాజాగా బీఎల్వోలు ఓటరుస్లిప్పులు ఇవ్వటానికి ఇంటింటికి వెళ్లగా ఎంతో కాలంగా అక్కడే నివాసం ఉంటున్న అనేకమంది పేర్లు ఓటర్‌జాబితాలో లేక పోవటంతో బీఎల్వోలు వారికి ఓటరు స్లిప్పులు ఇవ్వలేదు. దీంతో అలాంటి వారు తమకు స్లిప్పులు ఎందుకు ఇవ్వటంలేదని నిలదీయగా ఓటర్ల జాబితాలో మీ ఓట్లు లేవని జాబితా తెచ్చి చూపిస్తున్నారు. ఓటర్ల జాబితాలో ఓటు లేనివారంతా టీడీపీ సానుభూతిపరులు కావటంతో అధికారపార్టీ వారు అధికారులను మేనేజ్ చేసి ఎన్నికలలో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశ్యంతో తొలగించారని తెలుస్తోంది.

ఆర్యవైశ్యులకు అండగా టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న బీద గిరిధర్

అల్లూరు, మే 10 : ఆర్య వైశ్యులకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరు కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఆయన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి, కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, కావలి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్యలతో కలసి ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో ఆర్యవైశ్యులు ప్రశాంతంగా వారి వ్యాపారాల్లో రాణించారన్నారు. వైసీపీ పాలనలో వేధింపులకు గురవుతున్నారన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి కలసి రాష్ట్రంలో పోటీ చేస్తుందని, కావలి అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడా రామకృష్ణారెడ్డి, శ్రీరామ్ మాల్యాద్రి, దమ్మాల బ్రహ్మానందం, రవ్వా హరికుమార్, జలదంకి శ్రీనివాసగుప్తా, అమరా సుధాకర్, ఎద్దల కృష్ణమూర్తి, వాసవీ క్లబ్ వనితా మండలి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేశ్వరరెడ్డి

కందుకూరు, మే 10: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈనెల 11వ తేది రాత్రి 7 గంటల నుంచి 13వ తేది రాత్రి 7 గంటల వరకు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు సీజ్ చేస్తామని, ఆ సమయంలో, అంతకు ముందు మద్యం విక్రయాల్లో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ అధికారి కె.నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులు, ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లతో డ్రైడే రోజుల్లో పాటించాల్సిన నియమనిబంధనల గురించి శుక్రవారం స్థానిక సెబ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా పరిమితికి మించి మద్యం అమ్మకాలు జరిపినా రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించినా అలాంటివారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పీ.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుతోనే మాదిగల అభివృద్ధి



ఇంటింటి ప్రచారంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు

జలదంకి, మే 10: ఉదయగిరి అసెంబ్లీ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపుతోనే ఈ ప్రాంతంలో మాదిగ జాతి అభివృద్ధి చెందుతుందని ఎంఆర్‌పీఎస్ నేత పందిటి అంబేద్కర్‌మాదిగ పేర్కొన్నారు. మండలంలోని క్రిష్ణాపాడు, చామదల ఎస్సీ కాలనీల్లో శుక్రవారం ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలతో కలసి ఇంటింటా ప్రచారం చేశారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్లకు ఓట్లేయాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలంటే ఇంత నిర్లక్ష్యమా!?



ఉదయగిరి రోడ్డులో జమ్మలపాలెం వంతెన వద్ద అప్రోచ్ రోడ్డులో గుంతలు

కావలి, మే 10 : కావలి-కలిగిరి రోడ్డులో జమ్మలపాలెం దగ్గర నిర్మిస్తున్న వంతెన వద్ద బైపాస్ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డులో పెద్ద గుంటలు పడి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అక్కడ రోడ్డు నిర్మాణంలో భాగంగా నిత్యం టిప్పర్లు తిరుగుతున్నా ఆ గుంటను పూడ్చకపోవడం చూస్తే ఉదయగిరి రోడ్డు హైవే నిర్మాణం చేపట్టే కాంట్రాక్టర్లకు దానిని పర్యవేక్షించే అధికారులకు ప్రజల ప్రాణాలంటే ఎంత నిర్లక్ష్యమో ఆ గుంటను చూస్తే అర్థమవుతోంది. రాత్రి సమయంలో అక్కడ గుంట కనిపించక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఆ గుంటను పూడ్చించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

టీడీపీలోకి జోరుగా వలసలు



కందుకూరు : టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు



ఉలవపాడు : టీడీపీలో చేరిన వైసీపీ నేతలతో ఇంటూరి

కందుకూరు, మే 10: కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో జోష్ కొనసాగుతోంది. ప్రతిరోజు వందలాదిమంది వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో శుక్రవారం లింగసముద్రం మండలం జంపాలవారిపాలెంకు చెందిన జంపాల శివ, శ్రీను ఆధ్వర్యంలో 15 కుటుంబాలు, కందుకూరు మండలం జిల్లెలమూడికి చెందిన రావెళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 15 కుటుంబాలు, వలేటివారిపాలెం మండలం సింగమనేనిపల్లికి చెందిన పలువురు, గుడ్లూరు మండలం అమ్మవారిపాలెం, స్వర్ణాజీపురం గ్రామాలకు చెందిన పలువురు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు బోయపాటి రమేష్, లక్ష్మీనారాయణ, చెంచురామయ్య, వంశీ, కాకు వేణు, మేకల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

భీమవరం, ఎల్ రాజుపాలెం, కృష్ణాపురంలో...

ఉలవపాడు : మండలంలోని భీమవరం, ఎల్ రాజుపాలెం, కృష్ణాపురం గ్రామాలలో కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీకి చెందిన చలపతిరాము, మధుబాబు, కొండలరావు, తుల సీరామ్, మాలకొండయ్య, మధుబాబు, బాలాజీ, 'సురేష్‌బాబు, ప్రతాప్ తదితర 25 వైసీపీ కుటుంబాలు, వడ్డెరపాలెంకు చెందిన మరో 10 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి ఇంటూరి పార్టీ కండువా కప్పారు.

టీడీపీకి మద్దతుగా ప్రచారం : దళితులను ఆర్థికంగా అనగదొక్కి, ఐదేళ్లలో ఎలాంటి ఎదుగుబొదుగు లేకుండా దళితుల జీవితాలను నిర్వీర్యం చేసిన దళిత ద్రోహి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంఎస్పీ రాష్ట్ర సీనియర్ నాయకుడు వర్ల దేవాదాసు మాదిగ అన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం ఆయన మండలంలోని ఆత్మకూరు ఎస్సీ కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. జగన్ మోహన్‌రెడ్డి దళితులకు చేసిన అన్యాయాన్ని గుర్తుకు తెచ్చుకొని మందకృష్ణ ఆదేశాల మేరకు కందుకూరు టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కందుకూరు ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ రావినూతల ముత్తు మాదిగ, కిట్టు మాదిగ, రావినూతల బజాక్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు బీసీ కాలనీ వాసులు...

గుడ్లూరు : గుడ్లూరు బీసీ కాలనీకి చెందిన పలువురు వైసీపీని వీడి శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు కుమారుడు ఇంటూరి సందీప్, వేమిరెడ్డి సోదరుడు శ్రీనివాసులరెడ్డిలు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో గుడ్లూరు బీసీ కాలనీ, ఇతర ప్రాంతాలకు చెందిన ఎస్కే బుడేసాహెబ్, ఎస్కే జిలానీ, ఎస్కే కాలేషా, ఓరుగంటి రమణయ్య, డాక్టర్ సుధీర్, జవంగుల వీరాస్వామి, శానం రాము తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనిగర్ల నాగరాజు, చెరుకూరి సూర్యనారాయణ, పారా జనార్దన్‌రావు, కావలి ఏసుదాస్, సేవకుడు కాకు మనోజ్‌రాజా, జనసేనా నాయకులు అన్నంగి చలపతి, సనిశెట్టి గిరిబాబు, అనిమిశెట్టి మాధవరావు, కుంచాల అంకమరావు, మూలగిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరి సౌజన్య రోడ్‌షో

లింగసముద్రం : ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా, ఇంటూరి నాగేశ్వరరావును ఎమ్మెల్యేగా గెలిపించాలని కందుకూరు కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య కోరారు. శుక్రవారం ఆమె టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో లింగసముద్రం పంచాయతీలోని జంగంరెడ్డిపాలెం, బలిజపాలెం, అంబేద్కర్‌నగర్, లింగసముద్రం, వాకమళ్లవారిపాలెం, జంపాలవారిపాలెం, తాతాహోటల్, తిమ్మారెడ్డిపాలెం గ్రామాలలో రోడ్‌షో నిర్వహించారు. కనిగిరిలో చెల్లని బుర్రా మధుసూదన్‌యాదవ్ కందుకూరులో ఎలా చెల్లుతాడో ప్రజలు ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొట్టే నారాయణ, చెబేటి రమేష్, బింకం శేషయ్య, పీ బాలకోటయ్య, సీహెచ్ బాలకోటయ్య, యు నాగేశ్వరరావు, ఎ రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే వర్గీకరణ సాధ్యం : ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారం కావాలన్నా, మాదిగల జీవితాల్లో వెలుగులు నింపాలన్నా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ చెప్పారు. శుక్రవారం మండలంలోని మొగిలిచెర్ల, ఆర్‌ఆర్ పాలెం, గంగపాలెం, గ్రామాలలోని ఆదిఆంధ్ర కాలనీల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు గౌడపేరు కాంతారావు మాదిగ, జడ భాస్కర్ మాదిగ, ఏ కిషోర్ మాదిగ, విజిల్ మాదిగ, ప్రసన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.



గుడ్లూరు : టీడీపీలో చేరిన వారితో ఇంటూరి కుమారుడు సందీప్



లింగసముద్రం : కరపత్రాలు అందజేస్తున్న ఇంటూరి సౌజన్య

హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

- విడతల వారీగా రూ.23,27,974 వసూలు
- బాధితుల ఫిర్యాదుతో అరెస్టు చేసిన పోలీసులు

కావలి రూరల్, మే 10: హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన గుడిపూడి వెంకట నిఖిలేష్ కుమార్‌ను శుక్రవారం కావలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద రెండవ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. బోగోలు మండలం విశ్వనాథరావుపేటకు చెందిన వెంకట నిఖిలేష్ కుమార్ తాను హైకోర్టు ఉద్యోగినని, హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని పట్టణంలోని క్రిష్టియన్‌పేటకు చెందిన బుడంశెట్టి సాయి మనోజ్‌ను నమ్మించాడు. అతని నుంచి 2024 జనవరి 30వ తేదీ నుంచి విడతల వారీగా రూ.23,27,974 వసూలు చేశాడు. అయినా ఉద్యోగం రాకపోవడం, ఆ విషయం అడిగే దాటవేయడంతో బాధితుడి జ ఈ నెల 8వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ గోపీచంద్ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

వేములపాడులో వైసీపీకి బిగ్ షాక్

- 140 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో వంటేరు, చేవూరి

జలదంకి, మే 10: మండలంలో వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. శుక్రవారం వేములపాడు పంచాయతీలో 140 బీసీ, ఎస్సీ కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ నేత చేవూరి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పోలింగ్‌కు ఇంకా మూడు రోజులు సమయం ఉండడంతో వైసీపీకి ఇంకెన్ని షాక్‌లు తగులుతాయోనని ఆ పార్టీ నాయకులు భీతిల్లుతున్నారు. పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పసుపుకండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లకు సైకిల్‌గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వంటేరు జయచంద్రారెడ్డి, తొక్కోలు నారాయణరెడ్డి, మద్దూరి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయం కోసం పనిచేస్తాం

ఉలవపాడు, మే 10 : టీడీపీ స్థాపించినప్పటి నుంచి పార్టీ పటిష్టతకు పని చేసిన అనుభవంతో శక్తివంచన లేకుండా కూటమి అభ్యర్థులు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల గెలుపు కోసం కృషి చేస్తామని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం ఉలవపాడులోని వారి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు దామచర్ల సుబ్బారావు మాట్లాడుతూ టీడీపీని గెలిపించుకోవడం చారిత్రాత్మక అవసరమని, ముందుచూపు కలిగిన చంద్రబాబు నాయుడే రాష్ట్రాభివృద్ధి చేయడానికి సమర్థుడని కొనయాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కారుమంచి పెనుగొండయ్య, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరి బండారు సోమురాజు, రాష్ట్ర ఉద్యోగుల సంఘం నాయకులు ఆవుల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

కావలిని డెల్టా ప్రాంతంగా మారుస్తా !

- గౌరవరం, రుద్రకోట గ్రామాలను దత్తత తీసుకుంటా
- ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి కావ్య హామీ



కావలిరూరల్ : క్రిష్ణారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నేతలు

కావలి రూరల్, మే 10: కావలి నియోజకవర్గాన్ని డెల్టా ప్రాంతంగా మారుస్తానని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గౌరవరంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని చెరువుకు నీరు రావడానికి ఉన్న ఇబ్బందులు తొలగించి రైతులకు మేలు జరిగేలా కృషి చేస్తానన్నారు. సోమశిల ప్రాజెక్టు ఏర్పాటు చేసినప్పుడు నెల్లూరు ఆయకట్టు ఎక్కువగా ఉండేదని, నెల్లూరు పట్టణం పెరిగినందున వ్యవసాయ భూములు నివాసప్రాంతంగా మారడం, క్రిష్ణపట్నం పోర్టు ఏర్పాటుతో సుమారు 75,000 ఎకరాల ఆయకట్టు తగ్గిందన్నారు. ఈ నేపథ్యంలో కావలి కాలువ ఆయకట్టు పెంచాల్సి ఉండగా పాలకుల నిర్లక్ష్యంతో ఎడారుగా మారుతుందన్నారు. మాగుంట పార్వతమ్మ ఎమ్మెల్యేగా, తాను జలదంకి ఎంపీపీగా ఉన్నప్పుడు గుడిపాడు వరకు ఉన్న ఉత్తర కాలువను జలదంకి వరకు తీసుకువచ్చేందుకు రైతులతో కలసి ధర్నాలు చేసి పోరాడి సాధించామన్నారు. కేటీఎస్ పూర్తి చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. కావలి నియోజకవర్గంతో పాటు జలదంకి మండలాన్ని డెల్టాగా అభివృద్ధి చేస్తానన్నారు. అలాగే గౌరవరం, రుద్రకోట గ్రామాలను దత్తత తీసుకుని రోడ్లు, కాలువలు ఏర్పాటు చెయ్యడంతో పాటు ఇళ్లస్థలాలు కేటాయించి అన్నిరకాల మౌలిక వసతులు కల్పించి మోడల్ విలేజ్‌లుగా తీర్చి దిద్దుతానన్నారు. గెలిచిన నెల రోజుల్లో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడతానన్నారు. ఈ ఎన్నికల్లో నాకు ఉపయోగపడని వ్యక్తులు బంధువులైనా, శత్రువులైనా నాకు అవసరం లేదన్నారు. నేను చాలా పేద కుటుంబం నుంచి వచ్చినందున కష్టాలు, నష్టాలకు ఎదురోడ్డి ఈ స్థాయికి చేరానన్నారు. నా కోసం నడిచి నా వెంట కష్టపడ్డవారిని నెత్తిన పెట్టుకుని మోస్తానని, వారే నా బంధువులన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆవుల రామక్రిష్ణ, చింతం బాబుల్‌రెడ్డి, మేదరమెట్ల ఈశ్వర్‌రెడ్డి, ఆళ్లపాక రవి గౌడ్, దేవికా గౌడ్, చింతం రమణమ్మ, సూరె శ్రీలత, నాయుడు రాంప్రసాద్, జనసేన నాయకుడు సిద్ధు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రచారంలో కావ్య క్రిష్ణారెడ్డి ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు.



కావలిరూరల్ : గౌరవరంలో మాట్లాడుతున్న కావ్య




బిట్రగుంట : టీడీపీ కండువా వేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

కడనూతలో పలువురి టీడీపీలో చేరిక

బిట్రగుంట : బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటినాగేశ్వరావు, స్థానిక నేతల ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం టీడీపీలో చేరారు. కావలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో కావలి కలగయ్య, చెంచు మురళి, సుధీర్, మారుబోయిన ప్రసాద్, నాటకరాణి మల్లయ్య, శ్రీకాంత్, భాస్కర్ తదితర 20 కుటుంబాలు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. కొండబిట్రగుంటలో టీడీపీ నేత రావి.విజయ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యువత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దగదర్తి అరుంధతివాడలో మాలేపాటి రవీంద్రనాయుడు, భానుచందర్‌నాయుడు గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిని గెలిపించాలన్నారు.

ఆంధ్రజ్యోతి జన కేతనం
శనివారం 11 మే 2024

అప్పుడే.. కాయ్ రాజా కాయ్ !



పోలింగ్ ఇంకా పూర్తి కానే లేదు.. అప్పుడే కందుకూరు నియోజకవర్గంలో అభ్యర్థుల విజయంపై గ్రామాల్లో జోరుగా పందేలు కాస్తున్నారు. ఎన్డీఏ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు, వైసీపీ తరఫున బుర్రా మధుసూదన్‌యాదవ్ పోటీ చేస్తుండగా, విజయం మాదంటే మాదంటూ ఇరు పార్టీల గ్రామస్థాయి నాయకులు రూ. లక్షల్లో పందేలు కాస్తున్నారు. అంతేకాకుండా ఒంగోలు, నెల్లూరు, నరసారావుపేట ఎంపీ అభ్యర్థుల విజయంపై కూడా జోరుగా పందేలు కాస్తు న్నారు. అధికారపార్టీ నేతలు పందేలకు వెనుకడుగు వేస్తుండగా, కూటమి నాయకులు సైసై.. అంటున్నారు. కూటమి అభ్యర్థి తరఫున రూ.లక్షకు లక్షన్నర ఇస్తామంటూ సవాల్ విసురుతున్నారు.

● కొత్త చుట్టాలొస్తున్నారు... !

బాగున్నావా అక్కా...? ఎలా ఉన్నావు చెల్లీ.. ఏంటీ అవ్వా.. కులాసానా... తాతా ఏం చేస్తున్నావ్.. తల్లీ... అబ్బాయెక్కడ.. ? ఇలా గ్రామాల్లో ప్రచారానికి వచ్చిన నేతలు ప్రేమలు ఒలకపోస్తూ ఓటర్లను పలకరిస్తున్నారు. పరిచయం ఉన్నా లేకున్నా అందరినీ వరుసలతో పలకరిస్తున్నారు. ఇవి రాజకీయ పలకరింపులని వాళ్లకీ తెలుసు.. వీళ్లకీ తెలుసు. గతంలో అభ్యర్థులే స్వయంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లకు నమస్కారం పెట్టి తమ గుర్తు చెప్పి ఓటు అడిగేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. కొత్త చుట్టాల్లా వచ్చి ఓటు అడుగుతున్నారు.

● ఎంత ఇద్దాం... ?

ఈ సారి ఓటుకు ఎంత ఇద్దాం.. అని రాజకీయ నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎదుట పార్టీ వారు ఇచ్చిన తరువాత మనమూ ఇద్దాంలే... అని అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఎదురు చూస్తున్నారు అయితే ఎవరు ముందు డబ్బులు పంపిణీ చేస్తారా ...?అంటూ నిరీక్షిస్తున్నారు. డబ్బులతో పాటు మద్యం కూడ ఇస్తే బాగుంటుందనుకుంటున్నారు. అయితే అందరి దగ్గర డబ్బులు తీసుకుని తమకు నచ్చినవారికి ఓటు వేద్దామని ప్రజలు భావిస్తున్నారు.

- పలేటివారిపాలెం

నేనూ ఓటేస్తా...!

అబ్బాయ్ : ఓటు వేయడం మన బాధ్యత బాబాయ్..

బాబాయ్ : ఏందిరా బాధ్యత..? డబ్బులిస్తే ఓటు వేస్తా.. లేకుంటే లేదు.

అబ్బాయ్ : బాబాయ్... నేను డబ్బులు తీసుకోను. అయితే ఓటు మాత్రం నచ్చినవారికి వేస్తా..

బాబాయ్ : ఏందిరా అబ్బాయ్.. మొన్న పండక్కి రాలేదు. ఇప్పుడు పండగల్లేవు.. సెలవులేమైనా ఇచ్చారా? ఏంటీ..?

అబ్బాయ్ : లేదు.. లేదు.. బాబాయ్.. ఈనెల 13వ తేదీ ఓటు వేయాలని సెలవు పెట్టి మరీ వచ్చా.

బాబాయ్: ఓరి పిచ్చోడా... ఇక్కడ డబ్బులు ఇవ్వరంట. ఓటు వేయడానికి అనవసరంగా ఖర్చు పెట్టుకుని వచ్చావ్.

అబ్బాయ్ : నేను డబ్బుల కోసమో.. ఇంక దేనికోసమో రాలేదు బాబాయ్... రాజ్యాంగం నాకు ఇచ్చిన హక్కును వినియోగించుకోవడానికి ఎంతో కష్టపడి వచ్చా..


బాబాయ్ : ఏందిరా కష్టపడడం... నాయకులే డబ్బులు ఇచ్చి ఓటు వేయమని మన చుట్టూ తిరుగుతుంటే...

అబ్బాయ్ : ఆ హక్కు మనకు అంత తేలికగా రాలేదు. దాన్ని పోరాడి తెచ్చుకున్నాం.

బాబాయ్: అది స్వాతంత్ర్యం కదరా...? ఓటు ఏంటీ ?

అబ్బాయ్ : బాబాయ్... అప్పట్లో మనకు ఓటు ఉండేది కాదు.. రాజ్యాంగం లేదు... అప్పటి పాలకులు మనల్ని బానిసలు చేసి అండించేవాళ్లు. దాంతో మన వాళ్లు పోరాటాలు చేసి స్వాతంత్ర్యం తెచ్చి, రాజ్యాంగం ద్వారా ఓటు హక్కు కల్పించారు.






బాబాయ్ : అవునురా...? అబ్బాయ్ ? నేనూ ఓటేస్తా.. డబ్బులు గిబ్బులు వద్దు... బాధ్యతతో ఓటేస్తా...!

- ఏఎస్‌పేట

ఓటుకు భలే రేటు!



పెద్ద నోట్లు రద్దు చేశారనే మాటే కానీ, ఈసారి ఎన్నికల్లో ప్రజలకు ఓటుకు రేటు మాత్రం బాగానే గిట్టుబాటు అయ్యింది. వారు, వీరు అనే తేడా లేకుండా అభ్యర్థులు పోటీ పడి ప్రజలకు డబ్బులు పంచిపెడుతున్నారు. ఏ పార్టీ సానుభూతిపరులు, ఓటు వేస్తారా!? లేదా!? అనే పరిశీలన లేకుండా పంపకాల్లో వారు వీరు అనే వివక్ష లేకుండా ప్రధాన పార్టీలన్నీ సమానంగా ప్రజలను ప్రలోభపెట్టే పనిలో విజయవంతం అవుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి జిల్లా వ్యాప్తంగా 70 శాతం పంపకాలు పూర్తయ్యాయి. మిగిలిన 30 శాతం కూడా ఈ రాత్రికే కంప్లీట్ కానుంది. నెల్లూరులో రూ.3వేలు, ఉదయగిరిలో రూ.5వేల వరకు ఒక్కో ఓటుకు పంచుతున్నారు. ఇక కోవూరు నియోజకవర్గంలో గ్రామాలనే కొనుగోలు చేసుకున్నంతస్థాయిలో ఉంటోంది. ఈసారి ఎన్నికల్లో విశేషం ఏమంటే ఎలాంటి ప్రతిఘటనలు లేకుండా ప్రశాంతంగా హాయిగా పంపకాలు జరగడం. చాలా నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులు ఇద్దరూ ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ లేకుండా కలిసి ఒప్పందం చేసుకున్నట్లు ఒకే రేటు ఫిక్స్ చేసి పంచిపెట్టారు. పంచిపెడుతూనే ఉన్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

మండల కేంద్రాల్లో రూ.2వేలు, గ్రామాల్లో రూ.1,500

అడ్డగింతలు లేవు.. అడ్డుకునేవారూ లేరు!

సిటీ, రూరల్‌లో పోటాపోటీగా..

నెల్లూరురూరల్ : ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు పోటాపోటీగా నగదు పంపిణీ చేస్తున్నాయి. నెల్లూరురూరల్లో ఓటరుకు రూ.2 వేలు చొప్పున, సిటీలో ఓ పార్టీ అభ్యర్థి ఓటుకు రూ. 3 వేలు ఇవ్వగా, మరో పార్టీ అభ్యర్థి రూ. 2 వేలు చొప్పున అందచేశారు. శుక్రవారం ఉదయం నుంచి అటు గ్రామాలలో, ఇటు మున్సిపల్ డివిజన్లలో పోటాపోటీగా పంపిణీ జరుగుతోంది. కొన్ని ప్రాంతాలలో ఈ పంపిణీ విషయమై కొందరు నాయకుల మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో నేతలు రంగంలోకి దిగి సర్దుబాట్లు చేస్తున్నారు.

కావలిలో నగదు, మద్యంతో ఎర

కావలి : కావలి నియోజకవర్గంలోని ప్రధాన పార్టీలతోపాటు ఓ స్వతంత్ర అభ్యర్థి కూడా ఓటర్లకు ఎర వేస్తున్నారు. ఇప్పటివరకు అసంతృప్త నాయకులను బుజ్జగిస్తూ వారికి ప్యాకేజీలు ఇస్తూ కాపాడుకుంటూ వచ్చిన నేతలు ఇప్పుడు పోలింగ్ కోసం ఓటర్లపై దృష్టి పెట్టారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటుకు రూ.2వేలు వంతున ఇస్తూ ఇప్పటికే రెండుభాగాలపైన పంపిణీ పూర్తి చేశారు. ఓ స్వతంత్ర అభ్యర్థి మాత్రం కొన్ని ప్రాంతాలను మాత్రమే ఎంపిక చేసుకుని ఓటుకు వెయ్యి రూపాయల వంతున పంపిణీ చేస్తున్నారు. అయితే మద్యం సరఫరాలో మాత్రం అధికార పార్టీ ముందంజలో ఉంది. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు అధికార పార్టీ నేతల కనుసన్నలలో ఉండటంతో వాటి నుంచి నేరుగా మద్యం కేసులను నాయకులకు పంపేస్తున్నారు. ఇక ప్రధాన పార్టీలలో అసంతృప్తి నాయకులను బుజ్జగించి సర్దుబాటు చేస్తున్నారు. కొందరైతే బుజ్జగింపులకు సర్దుకు పోతుండగా మరికొందరు ప్రత్యర్థి పార్టీల నుంచి ప్యాకేజీలు తీసుకుని పార్టీలు మారుతున్నారు.

కానరాని దురాయి

తీరప్రాంతంలో ఒకప్పుడు మత్స్యకారులు దురాయి వేసుకుని ఒకరికే ఓట్లన్నీ గుంపగుత్తుగా వేస్తుండేవారు. అయితే, ప్రస్తుతం అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించలేదు. అధికార పార్టీ నాయకులు మాత్రం ఆ విధానానికి తెరలేపుతున్నా సున్నితంగా తిరస్కరిస్తున్నట్లు సమాచారం.

'గిరి'లో ఓటుకు రూ.5వేలు

ఉదయగిరి : ఓటర్లను ఆకట్టుకునేందుకు రెండు రోజుల నుంచి తాయిలాల పంపిణీ సాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ అనుచరుల ద్వారా డబ్బులను పంపిణీ చేశారు. గ్రామస్థాయిని బట్టి రూ.1,500 నుంచి రూ.5వేల దాకా పంచుతున్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాను ముందేసుకుని లెక్కలు తీసి మరి పంపకాలు సాగిస్తున్నారు. బూత్ కమిటీ సభ్యులు తమ ప్రాంతాల్లో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నాయకులకు అందజేస్తున్నారు. ఆ తర్వాతే డబ్బుల పంపకాలు ఉంటున్నాయి. మరోవైపు డబ్బులతోపాటు మద్యాన్ని కూడా పంపిణీ జోరుగా సాగుతోంది.

ఆత్మకూరులో బెట్టింగ్‌ల జోరు

ఆత్మకూరు : సర్వేలు, అంచనాలతో వాతావరణం వేడెక్కడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల విజయావకాశాలపై బెట్టింగులు జోరందుకున్నాయి. ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, మర్రిపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో బెట్టింగుల జోరు కొనసాగుతోంది. అభ్యర్థుల విజయ అవకాశాలతోపాటు ఏ మండలంలో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందో అనే అంశంపైనా బెట్టింగులు కాస్తున్నారు. ఇక ఓటర్ల జాబితా ఆధారంగా ఓటుకు రూ.2000 ఇవ్వడానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో గల్లీ లీడర్లు ఓటుకు కొంత మొత్తాన్ని ముట్టజెపుతూ తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. కాగా, నూరు శాతం ఓటర్లకు రూ.2000 వంతున పంపిణీ చేయానికి కొందరు ద్వితీయశ్రేణి నాయకులు డిమాండ్ చేస్తున్నా 60 శాతం నుంచి 75 శాతం ఓటర్లకు మాత్రమే నగదు ఇస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని మండలాల్లో ఓటర్లకు డబ్బు పంపకం గుట్టుచప్పుడు కాకుండా మొదలు పెట్టారు. మరోవైపు పోలీసుల తనిఖీలు ముమ్మరంగా జరుగుతుండటంతో నగదు తరలించడం, సర్దుబాటు చేయడం అభ్యర్థులకు తలభారంగా మారింది. సొమ్ము, మద్యం, తాయిలాలు పోలీసుల కంట పడకుండా క్షేత్రస్థాయికి చేర్చడానికి ఆపసోపాలు పడుతున్నారు.

కందుకూరులో రెండ్రోజుల నుంచే!

కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో ఇరు పార్టీలు రెండు రోజుల క్రితం నుంచే తాయిలాలు పంపిణీలో తనమునకలయ్యాయి. కందుకూరు పట్టణం, మండల కేంద్రాలలో ఓటుకు రూ.3వేలు, గ్రామాల్లో 2వేలు వంతున పంపిణీ చేస్తున్నారు. ఎంపిక చేసుకున్న గ్రామాల్లో ఎక్కువ ఓటర్లకు డబ్బు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ప్రభావితం చేయగల నాయకు లకు స్పెషల్ ప్యాకేజీలూ ఇస్తున్నారు. పోలీసులు ఇబ్బంది పెట్టకుండా వారికి కూడా పెద్ద మొత్తంలో ముట్టజెప్పినట్లు సమాచారం.

'సర్వేపల్లి'లో ఇప్పటికి మందు!

వెంకటాచలం : సర్వేపల్లిలో ఓటుకు నోటు పర్వం మొదలు పెట్టక ముందే గ్రామాల్లో మందు పర్వం కొనసాగుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఈ కార్యక్రమంలో బిజీగా ఉన్నారు. అయితే ఈ పంపిణీ తలనొప్పిగా పరిణమిస్తున్నదని అభ్యర్థులు, స్థానిక నేతలు వాపోతున్నారు. నగదు పంపిణీ ఒక్క సారితో ముగిసి పోతుంది. అయితే మందు పంపిణీ మాత్రం పోలింగ్ రోజు వరకు కొనసాగించాల్సి వస్తున్నదని వారు వాపోతున్నారు. ఇటీవల ముత్తుకూరు, పొదలకూరు మండలాల్లో వైసీపీ నేతలు భారీ ఎత్తున నిల్వ ఉంచిన మద్యాన్ని సెబ్ అధికారులు సీజ్ చేసి వైసీపీ కీలక నేతలు, వారి అనుచరులను అదుపులోకి తీసుకొని జైలుకు పంపించారు. దీంతో మద్యం నిల్వ ఉంచడం, పంపిణీ చేయ డం వంటివి చేస్తు న్న నేతల్లో గుబులు పట్టుకుంది.

కోవూరులో గ్రామాలకు గ్రామాలే!

కోవూరు : నియోజకవర్గంలోని ఓటర్ల ముంగిటకే ప్రలోభాలు చేరడం ప్రారంభిచాయి. ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి తరఫున ఒక్కో ఓటుకు రూ.2500 ఇస్తుండగా, మరో ప్రధాన పార్టీ నాయకులు రూ.2వేలు చొప్పున అందిస్తున్నారు. ఓ పార్టీ నాయకులు వలంటీర్ల ద్వారా తమకు ఓటేస్తారని భావించే ఓటర్లకు మాత్రమే నగదు పంపిణీ చేస్తున్నారు. ఒక్కో వార్డులో 60 శాతం మందికి మాత్రమే పంపిణీ చేయాలని నాయకులు భావిస్తు న్నారు. విడవలూరు మండలంలోని కొన్ని గ్రామాలలో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్కో ఓటు కు రూ.10వేల నుంచి 12వేలు చొప్పున అంద జేసిన తెలిసింది. ఇందుకూరుపేట మండలం లోని ఓ గ్రామాన్ని రెండు వారాల కిందటే ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి పెద్ద మొత్తంలో చెల్లించి కొనుగోలు చేసుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఓ ప్రధాన పార్టీ నాయకులు ఓటర్లకు భారీగా మద్యం పంపిణీ చేశారు..


బాటిల్ కోసం బారులు

● నేటి సాయంత్రం నుంచి మందు బంద్!
● తిరిగి 14న తెరుచుకోనున్న దుకాణాల తలుపులు
● ముందురోజు క్యూ కట్టిన మందుబాబులు



ఉదయగిరి రూరల్: దుకాణాల వద్ద మద్యం కోసం బారులు తీరిన మందుబాబులు

ఉదయగిరి రూరల్, మే 10 : శనివారం సాయంత్రం తర్వాత మద్యం దుకాణాలు మూతపడతాయి. రెండ్రోజుల తర్వాత దుకాణాల తలుపుతు తెరుచుకుంటాయి. మధ్యలో ఆదివారం. ఇంకేముంది... మద్యం దుకాణాల ముందు మందుబాబులు క్యూకట్టారు. ఉదయగిరి నియోజకవర్గంలో శుక్రవారం మద్యం దుకాణాలు మందుబాబులతో కిక్కిరిసిపోయాయి. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. దీంతో దుకాణాల్లో అమ్మాల్సిన కోటా మధ్యాహ్నం 12 గంటలకే పూర్తవుతోంది. ఆ తరువాత మద్యం కావాలంటే బ్లాక్‌లో అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. మరోవైపు పోలింగ్‌కు సమయం దగ్గరపడడం, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు మద్యం బదులు డబ్బులు అందజేస్తున్నారు. దీంతో నగదు చేత పట్టుకుని మందుబాబులు దుకాణాల వద్ద ఉదయం నుంచే బారులుతీరుతున్నారు. శుక్రవారం ఉదయగిరిలోని మూడు మద్యం షాపుల వద్ద మందుబాబులు బారులుతీరారు. షాపుల్లో లక్ష్యం పూర్తి కావడంతో సిబ్బంది మధ్యాహ్నానికే దుకా ణాలను మూసివేయడం, గంటల కొద్దీ క్యూలో నిలబడినా మద్యం దొరక్క పోవడంతో మందుబాబులు నిరాశతో వెనుతిరిగారు.



మందు దొరుకుతుందో లేదో!



ఎర్రటి ఎండలో అవస్థలు పడుతూ..

● అధిక ధరలకు విక్రయాలు

మద్యం అమ్మాల్సిన లక్ష్యం పూర్తి కాగానే దుకాణాలు మూతపడుతున్నాయి. కొంత మంది మద్యం బెల్టు నిర్వాహకులు ఇదేతం తుగా భావించి తమ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకొని ఒక్కో బాటిల్‌కు రూ.10 చొప్పున అందజేసి దుకాణాల నుంచి మద్యం తెప్పించుకుంటున్నారు. అనంతరం బ్లాక్‌లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అవసరాన్ని బట్టి క్వార్టర్‌పై రూ.100 నుంచి 150 అదనపు ధరకు విక్రయిస్తున్నారు.

● వరికుంటపాడులో ఉద్రిక్తత

వరికుంటపాడు : మద్యం అమ్మకాలపై ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలు అధికార పార్టీ నాయకులు, దుకాణ సిబ్బంది కి వరంగా మారుతోంది. నాయకుల అవసరాన్ని ఆసరా చేసుకొని జేబులు నింపుకుం టున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని వరికుంటపాడు, తిమ్మారెడ్డి పల్లి, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో షాపుల నుంచి మద్యం పక్కదారి పడుతోంది. ముఖ్యంగా పెద్దిరెడ్డిపల్లిలో అధికార పార్టీ నాయకులు చెప్పిందే వేదంగా అనుకూల వ్యక్తులకు మద్యం ఇస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రభు త్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తిస్థాయి మద్యాన్ని తమకే కేటాయించాలని అధికార పార్టీ నాయకులు తమదైన శైలిలో సిబ్బందికి హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ వర్గీయులతోపాటు మద్యంప్రియులు శుక్రవారం ఉదయాన్నే మద్యం దుకాణం వద్దకు భారీస్థాయిలో చేరుకొని క్యూ కట్టారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా గంటల తరబడి బారులు తీయడంతో తొక్కిసలాట నడుమ ఉద్రిక్తత నెలకొంది. దీంతో మొక్కుబడిగా ఏర్పాటు చేసిన బారికేడ్లు సైతం విరిగిపోయాయి. అందిన ఫిర్యాదుల మేరకు ఎస్ఐ తిరుపతయ్య తన సిబ్బందితో హుటాహుటిన దుకాణం వద్దకు చేరుకుని అమ్మకాలు పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కోటేశ్వరరావు సైతం అక్కడికి చేరుకొని మద్యం అమ్మకాలను పర్యవేక్షించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

● సీతారామపురంలో తోపులాట

సీతారామపురం : సీతారామపురం గ్రామ పంచాయతీలో శుక్రవారం రెండు మద్యం దుకాణాల వద్ద ఉద్రిక్తత నెలకొంది. మద్యం కొనుగోలు చేసే వారి మధ్య తోపులాట జరిగింది. మద్యం విక్రయాలు లక్ష్యం పూర్తి కాగానే దుకాణాలు మూసేస్తున్నారు. ఈ క్రమంలో తమకు మద్యం దొరుకుతుందో లేదోనన్న ఆత్రుతతో మద్యం ప్రియులు బారులుదీరారు. దీనికితోడు సిబ్బంది ఓ వర్గానికే మద్యం విక్రయిస్తున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు.



ఉదయగిరి రూరల్: దుకాణాల వద్ద మద్యం కోసం బారులుతీరిన మందుబాబులు

ఎన్నికలకు పటిష్ట భద్రత

● 450 సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
● ప్రతి సెగ్మెంట్‌కు డీఎస్పీ స్థాయి అధికారి
● ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి
● జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్



నెల్లూరు(క్రైం). మే 10: ప్రజలంతా నిర్భయంగా, శాంతి యుత వాతావరణంలో ఓటు వేసేలా సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ కె ఆరీఫ్ హాఫీజ్ తెలిపారు. పోలీసు అతిథి గృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 2,470 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలు జరుగుతు న్నాయని చెప్పారు. వీటిల్లో 450 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించామని, కేంద్ర బలగాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ముందస్తుగా రౌడీషీటర్లతోపాటు ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల సమయంలో కేసుల్లో ఉన్న సుమారు 10,485 మందిని బైండోవర్ చేశామన్నారు. ఎన్నికలు ముగిసేంత వరకు వీరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. జిల్లాలో 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, 26 ఫ్లైయింగ్‌స్క్వాడ్‌లు, 26 ఏఎస్‌టీలు, 46 ఎంసీసీ, 105 క్యూఆర్‌టీ బృందాలతో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని వివరించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి రూ.2,72,31,845 నగదు, రూ.2,72,054 విలువ చేసే ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. 663 కేసుల్లో రూ.30,56,981 విలువ చేసే 3990.04 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 10కేసుల్లో పొరుగు రాష్ట్రాలకు చెందిన 205.8 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు. నాటు సారాపై దాడులు చేసి 37.5 లీటర్లను స్వాధీనం చేసుకున్నామని, 28,700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని చెప్పారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై ఇప్పటివరకు 67 కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల ప్రలోభాలపై సీవిజిల్ యాప్, 1950 హెల్ప్‌లైన్, డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

● బందోబస్తుకు 4వేలకుపైగా సిబ్బంది

ఎన్నికల బందోబస్తుకు 4వేల మందికిపైగా సిబ్బంది ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పోలీసులతోపాటు విశ్రాంత పోలీసులు, ఆర్మీ అధికారులు, ఎన్‌సీసీ అధికారులతో పాటు 4ప్లటూన్ల బీఎస్‌ఎఫ్ బలగాలు, 4కంపెనీల తమిళనాడు రాష్ట్ర ఆర్మెడ్‌ఫోర్స్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు.

● ఒక్కో సెగ్మెంట్‌కు డీఎస్పీ స్థాయి అధికారి

ప్రతి నియోజకవర్గానికి డీఎస్పీ స్థాయి అధికారిని ప్ర త్యేక అధికారిగా నియమించామన్నారు. నెల్లూరు అసెంబ్లీ స్థానానికి నెల్లూరు డీఎస్పీ, రూరల్‌కి ట్రాఫిక్ డీఎస్పీ, కోవూరుకి దిశ డీఎస్పీ, సర్వేపల్లికి నెల్లూరు రూరల్ డీఎస్పీ, కావలికి కావలి డీఎస్పీ, ఆత్మకూరుకి ఆత్మకూరు డీఎస్పీ, ఉదయగిరి, కందుకూరులకు కందుకూరు డీఎస్పీ, వెంకటగిరి పరిధిలోని మండలాలకు ఏఆర్ డీఎస్పీని ప్రత్యేక అధికారిగా నియమించామని చెప్పారు.

ఏజెంట్లు కోవర్టులైతే.. అంతే సంగతులు !

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పడిన కష్టానికి ఆ ఒక్కరోజే ఫలితం దక్కనుంది. పోలింగ్ రోజున బూత్‌లో కూర్చొని దొంగఓట్లను నిరోధించే పోలింగ్ ఏజెంట్ల చేతిలోనే అభ్యర్థుల భవిత ఉంటుంది. బోగస్ ఓట్లు పడకుండా చూడటం.. పోలింగ్ సక్రమంగా జరుగుతుందా... లేదా ? అని గమనించడం పోలింగ్ ఏజెంట్ల బాధ్యత. పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని అతను నిశితంగా పరిశీలించాలి. అనుమానం వస్తే ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లాలి. కావున నమ్మకస్తులైనవారినే ఏజెంట్‌గా అభ్యర్థులు ఉంచుతారు. ఒకవేళ ఏజెంట్ అవతల పార్టీకి కోవర్టుగా మారినా, బెదిరింపులు, డబ్బుకు లొంగినా అభ్యర్థికి ఇక అంతే సంగతులు.

- ఉదయగిరి

వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ.500 కోట్ల మట్టి దోపిడీ

● అధికార పార్టీ నేతల అక్రమాలతో సర్వనాశనమైన చెరువులు, ప్రభుత్వ భూములు

వెంకటాచలం, మే 10 : వైసీపీ ఐదేళ్ల పాలనలో మండలంలోని కనుపూరు, కంటేపల్లి, గొలగమూడి, అనికేపల్లి, ఈదగాలి, శ్రీకాంత్‌కాలనీ, కాకుటూరు, చెముడుగుంట, రామదాసు కండ్రిగ, గుడ్లూరువారిపాళెం, ఇడిమేపల్లి, ఎర్రగుంట, కసుమూరు, సర్వేపల్లి తదితర గ్రామాల్లో రూ.500 కోట్ల రూపాయలకు పైగా గ్రావెల్, మట్టి దోపిడీ జరిగినట్లు ఆరోపణలున్నాయి. మంత్రి కాకాణి అండదండలతో గ్రావెల్ మాఫియాతో వైసీపీ నేతలు కుమ్మక్కై మండలంలోని చెరువులు, రిజర్వాయర్, విలువైన ప్రభుత్వ భూములు, కొండలు, తిప్పలను సర్వనాశనం చేశారు. 20 అడుగులకుపైగా భారీ గుంతలు పెట్టేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి, పగలు జోరుగా మట్టి, గ్రావెల్ దోపిడీ జరిగింది. అధికారులు సైతం గ్రావెల్ మాఫియాకి సహకరించడంతో ప్రజా సంపద లూటికి గురైంది. ఎక్కడ చూసినా భారీ గ్రావెల్ గుంతలే కనిపిస్తున్నాయి. భారీ గ్రావెల్ గుంతల కారణంగా గొలగమూడి, చెముడుగుంట, అనికేపల్లి, సర్వేపల్లి, ఈదగాలి, ఇడిమేపల్లితోపాటు మరికొన్ని గ్రామాల్లో పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. మూగజీవాలు కూడా గ్రావెల్, మట్టి గుంతల్లో పడి చనిపోయాయి.


గ్రావెల్ తవ్వకంతో ప్రభుత్వ భూమిలో ఏర్పడిన గుంత

వరుస ఓటమిలతో అలసి పోయా..

ఈసారి ఆశీర్వదించండి!

లేదా ఇంత విషమిచ్చి చంపేయండి!

పొదలకూరులో సభలో సోమిరెడ్డి భావోద్వేగ ప్రసంగం

పొదలకూరు, మే 10 : 'జనం కోసం 40ఏళ్లుగా పోరాటాలు చేస్తూ ఆస్తులు అమ్ముకుని వరుస అపజయాలతో తలెత్తుకోలేని స్థితిలో ఉన్న తన జీవితాన్ని సర్వేపల్లికే అంకితం చేశా. అలాంటిది నాకే ఎందుకిలా జరుగుతోంది. సర్వేపల్లికి చేయాల్సినవన్నీ చేశా. ఇంకేం చేయాలి!? ఈ ఎన్నికల్లో గెలిపించండి. లేదా ఇంత విషం ఇచ్చి చంపేయండి.' అంటూ సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భావోద్వేగతంతో అన్నారు. వరుస ఓటమిలతో తాను అలసి పోయానని, ఈసారి అత్యధిక మెజారిటీతో తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పట్టణంలోని గేట్ సెంటర్ కూడలి నుంచి ప్రచార రథంపై తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ కలిసి ప్రచారం చేశారు. అనంతరం పంచాయతీ బస్టాండులో జరిగిన సభలో సోమిరెడ్డి మాట్లాడుతూ ఈ సభలోని జన సమూహాన్ని చూసి తోడేరు రెడ్డికి నిద్ర పట్టదన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన దగ్గర నుంచి కాకాణి ఇల్లు వెలవెలబోయిందని, తన ఇల్లు టీడీపీ, ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలతో కళకళలాడుతోందన్నారు. పేద ప్రజలను, టీడీపీ నాయకులను చిత్రహింసలకు గురి చేసి అక్రమకేసులు పెట్టించిన కాకాణికి మనిషిగా బతికే హక్కు లేదన్నారు. సర్వేపల్లిలో ప్రజాస్వామ్యాన్ని కాకాణి ఖూనీ చేశారంటూ మండిపడ్డారు. ఇసుక, తెల్లరాయి, భూ అక్రమాలపై తాము అధికారంలోకి రాగానే స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం వేయిస్తామన్నారు.


సభలో ప్రసంగిస్తున్న టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి వరప్రసాద్

● వైసీపీ ఒక డ్రామా ట్రూప్ : వరప్రసాద్

వైసీపీ ఒక డ్రామా ట్రూప్ అని, జగనే ఒక నిర్మాత, డైరెక్టర్, యాక్టర్ అని తిరుపతి పార్లమెంటు ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ అన్నారు. వైసీపీని వీడడంతో తనకు స్వతంత్రం వచ్చినట్లుగా ఉందని అన్నారు. సర్పంచ్‌గా కూడా గెలవని వ్యక్తులు, సలహాదారులు ఎంపీలుగా ఉన్నారన్నారు. వైసీపీ అభ్యర్థులు ఎంపీలుగా గెలిస్తే వారి బటన్ పుంగనూరులో పెద్దిరెడ్డి దగ్గర ఉంటుందన్నారు. ఈ సభలో సర్వేపల్లి జనసేన నాయకుడు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకుడు సర్దార్ మాట్లాడుతూ, టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, ఆదాల సుగుణమ్మ, కోడూరు భాస్కర్‌రెడ్డి, వీ.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఒకరికి ఓటేస్తే ముగ్గురం పని చేస్తాం

ఈ ఎన్నికల్లో టీడీపీకి ఓటేస్తే తమ కుటుంబ సభ్యులం తాను, తన భార్య శృతిరెడ్డి, తన తండ్రి సోమిరెడ్డి ముగ్గురం పని చేస్తామని సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సంగం రోడ్డు కూడలి నుంచి బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, యువతతో గేట్ సెంటర్ మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం మర్రిపల్లి వద్ద ఏర్పాటు చేసిన యువభేరి సభలో తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ జనసేన, బీజేపీ నాయకులు, యువతను ఉద్దేశించి మాట్లాడారు. అక్రమాల కాకాణి చాప్టర్ క్లోజ్ అవుతుందని సోమిరెడ్డి 1994లో తాను సాధించిన మెజారిటీ రికార్డును తానే బ్రేక్ చేసేలా యువత పని చేయాలని పిలుపునిచ్చారు.

● టీడీపీలో చేరికలు

వెంకటాచలం : మండలంలోని కాకర్లవారిపాళెం, అనికేపల్లి, గొలగమూడి గ్రామాలకు చెందిన 35 కుటుంబాలు, కాకర్లవారిపాళెం వైసీపీ నేత బత్తల ఏడుకొండలు సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. నగరంలోని వేదాయపాళెంలో ఉన్న సోమిరెడ్డి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ తదితరులు ఉన్నారు.

● సర్వేపల్లిలో సోమిరెడ్డి కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధురెడ్డి ప్రచారం నిర్వహించారు. అలాగే అనికేపల్లి, గొలగమూడి గ్రామాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఆధ్వర్యంలో రాజన్న సైన్యం సభ్యులు, ఆపార్టీ నేతలు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు.

● తోటపల్లిగూడూరు : సోమిరెడ్డిని గెలిపించాలని కోరుతూ కొత్తపాలెం, ముంగల దొరువు, చింతోపు, నరుకూరు గ్రామాలలో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాగుంట రమణారెడ్డి, కొణతం రఘుబాబు, పాకం వెంకయ్య, మొగలిగుంట పోతన, సుబ్బారావు పాల్గొన్నారు. అలాగే కొత్తపాలెం, ముంగల దొరువు, చింతోపు, నరుకూరు గ్రామాలలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, రఘుబాబు, వెంకయ్య, గుంట పోతన, సుబ్బారావు, చేవూరు శ్రీనివాసులు, షేక్ అమీర్‌జాన్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాసంప్రోక్షణ పూజలు


మహాసంప్రోక్షణ సందర్భంగా హోమాలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 10: నగరంలోని పప్పులవీధి ప్రసన్న అంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం మహాసంప్రోక్షణ శాస్త్రోక్తంగా జరిగింది.

పింక్ పోలింగ్ కేంద్రం ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), మే 10 : నగరంలో సంతపేటలోని సెయింట్ జోసఫ్ బాలికల ఉన్నత పాఠశాలలో పింక్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం దీనిని ప్రారంభించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాన్ని అందంగా ముస్తాబు చేసి మహిళలకు ఆహ్వానం పలికేలా పింక్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర ఆర్వో వికాస్ మరమ్మత్, పలువురు యువతులు, బాలికలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● టీఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడిపూడి


ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

నెల్లూరు (విద్య), మే 10 : రాష్ట్రాభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని టీఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడిపూడి కల్యాణ్ అన్నారు. నగరంలోని 47వ డివిజన్‌లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడిచిన ఐదేళ్లలో జగన్ పాలనలో రాష్ట్రం నిర్వీర్యమైపోయిందన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి ఒక్క చంద్రబాబు నాయుడుతోనే జరుగుతుందన్న నమ్మకం ప్రజల్లో వచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలం తా నగర ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాల ని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ డిప్యూటీ చైర్మన్ వేలూరు దశరథరామయ్య, నగర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్ష్మీ ప్రసాద్, నేతలు జయశంకర్, శ్రీధర్, పెంచలరాజు, రమేష్, ఆనంద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు సర్వేపల్లి

రాపూరు అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

● కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ


చానాయపాళెంలో మాట్లాడుతున్న కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ

రాపూరు(డక్కిలి), మే 10: పట్టణ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించినట్లు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయి ప్రియ తెలిపారు. శుక్రవారం చానాయపాళెంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి రామకృష్ణను గెలిపిస్తే వెనకబడ్డ రాపూరు ప్రాంతాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణ జనాభా పెరుగుతున్న దృష్ట్యా కావలసిన అన్ని వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రం పెంచలకొన, కండలేరు డ్యాం పరిసర ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా మారుస్తామన్నారు. కండలేరు జలాశయంలో బోట్ షికార్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాపూరు ప్రాంతంలో యువతకు ఉపాధి కల్పనకు ప్రత్యేకచొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్ను తిరుపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి, భాస్కరరెడ్డి, నువ్వుల శివరామకృష్ణ, తిక్కమనేని లక్ష్మీనరసింహ ప్రసాద్, కాపా శ్రీనివాసులునాయుడు ఉన్నారు.

మాజీ సర్పంచి రౌతు మృతికి సంతాపం

వెంకటాచలం, మే 10 : మండలంలోని తిరుమలమ్మపాళెం మాజీ సర్పంచ్ రౌతు మల్లికార్జున్ (55) గురువారం రాత్రి మృతిచెందారు. రౌతు మల్లికార్జున్ గతంలో సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డికి ముఖ్య అనుచరుడిగా పనిచేశారు. దీంతో సీవీ శేషారెడ్డి శుక్రవారం రౌతు మల్లికార్జున్ ఇంటికి వెళ్లి నివాళ్లర్పించారు. పలువురు టీడీపీ నేతలు రౌతు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఓటరు స్లిప్పులు కోసం సచివాలయం వద్దకు చేరుకున్న ఓటర్లు

బుచ్చిరెడ్డిపాళెం, మే 10: బుచ్చిరెడ్డిపాళెం పట్టణంతోపాటు మండలంలో ఓటరు స్లిప్పులు పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'ఓటరు స్లిప్పులు అందక సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు' పేరుతో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఓటరు స్లిప్పులు పంపిణీకి చర్యలు చేపట్టడంతో ఓటుహక్కు వినియోగించుకునేందుకు వందలాది మందికి ఓటరు స్లిప్పులు అందాయి.

వేమిరెడ్డిని గెలిపించండి

● సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుబ్బయ్య


కరపత్రాలను విడుదల చేస్తున్న పందిటి సుబ్బయ్యమాదిగ

నెల్లూరు(హరనాథపురం), మే 10 : సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ కోరారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో తెలుగుదేశం పార్టీకి మద్దతుగా రూపొందించిన కరపత్రాలను శుక్రవారం ఆయన విడుదల చేశారు. టీడీపీ హయాంలో మాదిగల అభివృద్ధికి అనేక పథకాలు ఉండేవ న్నారు. జగన్ ప్రభుత్వం వాటిని తుంగలో తొక్కిందన్నారు. ఈ దఫా తెలుగుదేశం పార్టీ మాదిగలకు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించిందని, వారిందరినీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలిగిరి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

● మనుబోలు వద్ద బైక్ బోల్తా పడి ఇద్దరు..

● బుచ్చిలో ఆగి ఉన్న బైక్‌ను ఆటో ఢీకొని టీఎన్ఎస్‌యూ నేత మృత్యువాత

● మరొకరికి గాయాలు


ప్రమాదస్థలంలో వేణు మృతదేహం

మనుబోలు, మే 10: జిల్లాలోని బుచ్చి, మనుబోలు మండలాల్లో గురు, శుక్రవారాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. మరొకరు గాయపడ్డారు .వివరాల్లోకి వెళితే... జాతీయరహదారిపై మనుబోలు పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బండి వేణు (18), చల్లా ఆకాష్(16) దుర్మరణం చెందారు. తిరుపతి జిల్లా పెళ్ళకూరు మండలం చిల్లకూరుకి చెందిన బండి చంద్రయ్యకు ఇద్దరు పిల్లలు. ఆయన కూలీ చేసుకుంటూ జీవిస్తున్నాడు. కుమారుడు వేణు ఇటీవల ఇంటర్ పూర్తి చేశాడు. నాలుగు రోజుల క్రితం కుమారుడికి సెకండ్ హ్యాండ్ బైక్ తీసిచ్చాడు. బైక్‌కు కట్టాల్సిన డబ్బులు, పేరు మార్పు కోసం వేణు చిల్లకూరుకి చెందిన తన స్నేహితుడు చల్లా ఆకాష్‌ను తీసుకుని నెల్లూరుకు వచ్చాడు. పని కాకపోవడంతో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో నెల్లూరు నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మనుబోలు వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీని అధిగ మించబోయి ఎడమ పక్కకు రాగా, సర్వీసురోడ్డు స్టాప్ బోర్డును ఢీకొని బైక్ బోల్తా పడింది. ప్రమాద స్థలంలోనే తల ఛిద్రమై వేణు మృతి చెందాడు. ఆకాష్ తీవ్రగాయాలతో రోదిస్తుండగా 108లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకి తరలించారు. చికిత్స పొందుతూ ఆకాష్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు. ఇద్దరు యువకుల మృతితో చిల్లకూరు వడ్డి పాళెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులంతా గూడూరు ఆసుపత్రి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.


వేణు (ఫైల్)


తీవ్ర గాయాలతో చల్లా ఆకాష్

● బుచ్చిలో టీఎన్ఎస్‌యూ నేత మృతి

బుచ్చిరెడ్డిపాళెం: ఆగి ఉన్న బైక్‌ను ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో టీఎన్ఎస్‌యూ నేత కొప్పోలు మహేష్ (35)మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి బుచ్చిలోని ఓ ఫంక్షన్ హాలు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, గురువారం రాత్రి టీడీపీ కార్యాలయం నుంచి ఇంటికి వెళ్లేందుకు స్నేహితుడు షానవాజ్‌ను బైక్‌లో రమ్మని మహేష్ ఫోన్ చేశాడు. షానవాజ్ వచ్చి బైక్‌లో మహేష్‌ను ఎక్కించుకుని బయలుదేరుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టి బోల్తాకొట్టింది. ఈప్రమాదంలో బైక్‌పై ఉన్న వారిద్దరూ కిందపడ్డారు. పెద్దగా గాయాలు లేకపోవడం తో ఇద్దరిని స్థానికులు పైకిలేపి ఆటోడ్రైవర్‌తో మాట్లాడి పంపించేశారు. మహేష్ వెంటనే తన తమ్ముడికి సమాచారమిచ్చి షానవాజ్‌తో కలిసి బుచ్చి ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. ఈలోపు మహేష్ తమ్ముడు శ్రీకాంత్ ఆసుపత్రికి వచ్చాడు. అక్కడ చికిత్స చేయించుకుని బయటకు వచ్చేలోపు మహేష్‌కు బాధ తీవ్రమైంది. అక్కడి నుంచి బుచ్చిలోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు చేస్తుండగా పరిస్థితి విషమించడంతో అంబులెన్స్‌లో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మహేష్ మృతితో గొల్లపాళెంలో విషాదం నెలకొంది. మృతుడికి ఏడు నెలల గర్భవతిగా ఉన్న భార్య, ఐదేళ్ల పాప ఉన్నారు. కాగా, మహేష్ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


కొప్పోలు మహేష్ (ఫైల్)

● ప్రశాంతిరెడ్డి పరామర్శ

కోవూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుచ్చి పెద్దూరులోని మృతుడి నివాసానికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి భార్యా బిడ్డలను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆ కుటుంబానికి రూ. 10లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆమె వెంట సూరా శ్రీనివాసులు రెడ్డి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, గుత్తా శ్రీనివాసులు, రామానాయుడు, వెంకయ్య, మురళి మహేష్, హరనాథ్, తదితరులు ఉన్నారు.


మృతుడి కటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రశాంతిరెడ్డి

జగన్‌కు తొత్తుగా పోలీసు వ్యవస్థ

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్డీ విల్సన్

కావలి, మే 10 : రాష్ట్రంలో పోలీసులు జగన్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి ఆర్డీ విల్సన్ పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలీసు బాస్‌లుగా ఉన్న రాజేంద్రనాథ్‌రెడ్డి, రామానుజనేయుల సారథ్యంలో జరిగిన దుర్మార్గాలపై విచారణ చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌సెక్రటరీ కూడా వైసీపీకి తొత్తుగా ఉన్నందున ఆయనపై కూడా ఎన్నికల కమిషన్ వేటు వేస్తేనే ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోగలరన్నారు. కావలి పట్టణంలో నిర్మించిన అమృత్ పథకం పైలాన్‌ను కావలి ఎమ్మెల్యే సమక్షంలో అప్పటి కావలి డీఎస్పీ సహకారంతో ధ్వంసం చేశారని, దానికి బాధ్యులపై పోలీసులు నేటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. బీజేపీ పాలనలో ముస్లిం, క్రిష్టియన్లకు ఎలాంటి ఇబ్బందులు జరగలేదన్నారు. ఓట్ల కోసం వైసీపీ నేతలు మైనార్టీలను రెచ్చగొడుతున్నారని, వాటిని నమ్మ వద్దన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కలయికతో రాష్ట్రానికి స్వర్ణయుగమన్నారు.

● వైసీపీకి ఓటు వేస్తే మన అస్తులు మనకు దక్కవు

కబ్జా కోరు, అవినీతిపరుడైన కావలి ఎమ్మెల్యేకు ఓటు వేస్తే మన ఆస్తులు మనకు దక్కవని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జీ.భరత్‌కుమార్ యాదవ్ తెలిపారు. కావలి ఎమ్మెల్యే కూడా నీతినిజాయితీలను గురించి మాట్లాడటం దెయ్యాలు, వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. కావలిలో ఘోరాలు, నేరాలు, దోపిడీలు, దుర్మార్గాలు, దాడులు చేసింది, చేయించింది ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కాదాని ప్రశ్నించారు. ఆయన అరాచకాలకు వ్యాపారవర్గాలు హడలిపోతున్నాయన్నారు. నాపైనే హత్యాయత్నంకు పథకం వేశారన్నారు. వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల అవినీతి చరిత్ర అందరికీ తెలుసని, అలాంటి వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని, టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన కావ్య క్రిష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు అంచిపాకల కమల, సీవీసీ సత్యం, కంచర్ల మురళి, కే.బ్రహ్మానందం, మందా కిరణ్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే జగన్‌రెడ్డి విదేశాలకు పరార్

● నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, మే 10 : ఎన్నికల్లో ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విదేశాలకు పారిపోతున్నారని నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మైపాడు గ్రామంలో స్థానిక యువనేత దువ్వూరు కల్యాణరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులకు అడుగడుగునా హారతులు పట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ద్వారా మైపాడుకు మహర్దశ రానున్నట్లు తెలిపారు. మత్స్యకార గ్రామాల్లో తాగునీరు సమస్యలు పరిష్కరిస్తామని, సైడు కాలువల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. మండలంలో సహజ వనరులను వైసీపీ నాయకులు దోచేశారని తెలిపారు. తాము కేవలం ప్రజాక్షేమం కోసమే రాజకీయాల్లోకి వచ్చామని అధికారం కోసం కాదన్నారు. ఎన్డీఏ మేనిఫెస్టో ద్వారా జరుగు ప్రయోజనాలను వారు వివరించారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల గుర్తు ఈవీఎం నమూనా చూపించి ఓట్లు వేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, అర్ వీరేంద్రనాయుడు, చెంచు కిషోర్‌యాదవ్, గంపల అనీల్‌కుమార్, పీఎల్ రావు, అవ్వారు ఏడుకొండలు, మునగాల రంగారావు, తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : ప్రచార సభలో ప్రసంగిస్తున్న వేమిరెడ్డి దంపతులు

వేమిరెడ్డి దంపతుల గెలుపు తథ్యం

కొడవలూరు : ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ శుక్రవారం గౌడ సంఘం నాయకులు మండల పరిధిలోని రేగడిచెలిక, చంద్రశేఖరపురం, కమ్మపాళెం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌడసంఘం నాయకుడు దాసరి విజయ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ అత్యధిక మెజారిటీతో వేమిరెడ్డి దంపతుల గెలుపు తథ్యమన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును ఎన్నుకుంటే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు దాసరి శ్రీనివాసులు, బండ్ల సుధీర్, యేనేటి నిరంజన్, వెంకయ్య గౌడ్ పాల్గొన్నారు. కాగా, చలివేంద్రం గిరిజన కాలనీలో టీడీపీ నాయకుడు తలపల మురళీ ఆధ్వర్యంలో కార్యకర్తలు బ్యాలెట్ నమూనాను చూపించి సైకిల్‌గుర్తుపై ఓటు వేయాల్సిందిగా కోరారు.


కొడవలూరు : రేగడిచెలికలో ప్రచారం చేస్తున్న గౌడ సంఘం నాయకులు

సోమశిల డ్యాంలో సముద్రపు చేపలు

అనంతసాగరం, మే 10: సోమశిల జలాశ యంలో అరుదైన సముద్రపు చేప జాలర్లకు చిక్కుతున్నాయి. నలుపు, బంగారుపు వర్ణం కలిగి నలుపు, తెలుపు చుక్కలు కలిగిన చేప ఇది. వీటిని చుక్కచేప అంటారని, అత్యంత పోషకాలు కలిగిన ఈ చేప కేజీ రూ.150 వరకు విక్రయిస్తున్నారు.


సోమశిల డ్యాంలో దొరికిన చుక్కచేప

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	157
లేయర్ లైవ్	103
స్కిన్ చికెన్	274
స్కిన్‌లెస్	304
లేయర్	175

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6954
వెండి కిలో ధర	రూ. 87,000
వెండి ఒక గ్రాము	రూ. 89.00

ఎన్నికల పర్వం

సమస్యాత్మక కేంద్రాల వద్ద ఇంటలిజెన్స్ బాగా పనిచేయాలి

● సిటీ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్

నెల్లూరు(సిటీ), మే 10 : నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఇంటలిజెన్స్ విభాగం పనితీరు బాగా ఉండాలని, ఏ చిన్న అవాంఛనీయ సంఘటనైనా ముందుగానే పసికట్టాలని సిటీ ఆర్వో వికాస్ మర్మత్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన సమీక్ష జరిపారు. మరో రెండు రోజుల్లో పోలింగ్ జరగనున్నందున అందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలని సూచించారు. పోలింగ్‌తోపాటు ఓట్లు వేసిన ఈవీఎం యంత్రాలను తరలించే రూట్లు, స్ట్రోరేజీ పాయింట్ల వద్ద పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన అక్కడ ఏర్పాట్లపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పరిశుభ్రతపై ఎంహెచ్‌వో సిబ్బందితో కలిసి పరిశీలించారు.


అధికారులతో సమావేశంలో ఆర్వో వికాస్ మర్మత్

వైసీపీకి ఓటేస్తే ఒంటిపై చొక్కా కూడా ఉండదు!

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), మే 10 : ఈ ఎన్నికల్లో వైసీపీకి ఓటేస్తే అధికారంలోకి వచ్చాక ఒంటిపై చొక్కా కూడా ఉండనివ్వరని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విమర్శించారు. శుక్రవారం నగరంలోని 9వ డివిజన్‌లో ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికా రంలోకి వస్తుందని ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నార న్నారు. టీడీపీ పాలనకు వైసీపీ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించారని తెలిపారు. టీడీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కువ్వారపు బాలాజీ తదితర నాయకులు పాల్గొన్నారు.


నారాయణకు ఓటు వేయమని కోరుతున్న కోటంరెడ్డి

రెండు రోజులు కష్టపడండి !

● జనసేన నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 10: ఎన్నికలకు రెండు రోజులు మాత్రమే సమయం ఉందని, ఈ రెండు రోజులు జనసైనికులు మరింత కష్టపడి పనిచేసి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు పిలుపునిచ్చారు. నగరంలో ఏసీనగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదని విమర్శించారు. నగరంలో పొంగూరు నారాయణను, రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్‌బాబు, సాయి మోహన్, షేక్ సాయిబాబా పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సుజయ్‌బాబు

నెల్లూరు సిటీ నెల్లూరు రూరల్

ఒక్కటీ పూర్తి చేయలేదు!


అసంపూర్తిగా ఉన్న ఘోషా ఆసుపత్రి


కాంక్రీట్ లైనింగ్ లేని సర్వేపల్లి కాలువ




కుంగి పగుళ్లిచ్చిన నెక్లస్ రోడ్డు

వైసీపీ అధికారం సాగించిన గత ఐదేళ్లలో నెల్లూరు నగరంలో ఒక్క పనినీ పూర్తి చేయలేదు. సర్వేపల్లి కాలువకు కాంక్రీట్ లైనింగ్ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఆ కాలువ పలుచోట్ల డంపింగ్ యార్డును తలిపిస్తోంది. గత ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి న నెక్లెస్ రోడ్డు పనులను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోగా నిర్వహణను కూడా గాలికి వదిలేయడంతో ఆ రోడ్డు బీటలువారి కుంగిపోతోంది. ఘోషా ఆసుపత్రి నిర్మాణం కూడా అంపూర్తిగానే ఉండిపోయింది. అభివృద్ధి చేస్తారని నమ్మి ఓటేస్తే ఉపయోగపడే ఒక్క పని కూడా పూర్తి చేయలేదని నగర వాసులు వైసీపీ పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సమయస్ఫూర్తితో ఎన్నికల విధులు నిర్వహించాలి

అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం

నెల్లూరు(క్రైం), మే 10: ఓటర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమయస్ఫూర్తితో ఎన్నికల విధులు నిర్వహించాలని, ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించరాదని ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ఆయన ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రానికి 100 మీటర్లలోపు జనసమూహం లేకుండా చూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లోకి మంచినీటి బాటిళ్లు, ఇంకు బుడ్డీలు, బాల్‌పెన్, మొబైల్ ఫోన్లు వంటివి ఎట్టిపరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లరాదన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బాడీ వార్న్ కెమెరాలు వినియోగించి అవాంఛనీయ ఘటనలు, నేరాలు జరగకుండా నిఘా ఉంచాలన్నారు. ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో ఎన్నికలు సజావుగా జరిగేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు సహకరిం చాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాస రావు, ట్రైనీ ఐపీఎస్‌లు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.


అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

● స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

నగరంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రత ఏర్పాట్లను ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ శుక్రవారం పరిశీలించారు. బారికేడ్ల ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎం బాక్సులు వచ్చే బస్సులను, ట్రాఫిక్ తదితర వివరాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కళాశాల చుట్టు పక్కల ఏర్పాటు చేయనున్న మూడంచెల భద్రతను, సీసీ కెమెరాల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు సమన్వయంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పహారా కాస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారులు స్ట్రాంగ్ రూంలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. అనంతరం ట్రైనీ ఐపీఎస్‌లకు భద్రతా చర్యలపై మార్గనిర్దేశం అందించారు.

జిల్లాలో సంస్కరణలు చేపట్టింది రాజునే !

● కాంగ్రెస్ నేతలు పల్లంరెడ్డి, దమయంతి

నెల్లూరు (వైద్యం), మే 10 : జిల్లాలో కలెక్టర్‌గా అనేక సంస్కరణలు చేపట్టిన చరిత్ర కొప్పుల రాజుకు ఉందని, ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయనను గెలిపించాలని పార్టీ నేత పల్లంరెడ్డి యశోధర కోరారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజు జిల్లాలో సారా ఉద్యమం, నిరక్షరాస్యత నిర్మూలన వంటి కార్యక్రమాలు చేపట్టి విజయం సాధించారని తెలిపారు. రాజు సతీమణి దమయంతి మాట్లాడుతూ ఇప్పటి వరకు దేశంలో జరిగిన మూడు విడతల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉందని తెలిపారు. రాహుల్ ప్రధాన మంత్రి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయనను నెల్లూరుకు పిలిపించి నెల్లూరు రూపురేఖలు మారుస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పావని, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షయ తృతీయ

కనుల పండువగా లక్ష మల్లెల పూజ




వ్యాసరాజమఠంలో లక్ష మల్లెల అర్చన చేస్తున్న అర్చకులు, వెంకటేశ్వరపురంలో పూజకు హాజరైన భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం), మే 10 : జిల్లాలో అక్షయ తృతీయ పండుగను శుక్రవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలను సందర్శించి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని చోట్ల విశేష హోమాలు జరిగాయి. బంగారం కొనుగోళ్లు గతేడాది కంటే మెరుగ్గా జరిగాయని వ్యాపారాలు సంతృప్తిని వ్యక్తం చేశారు. నగరంలో బంగారు దుకాణాలు ఎక్కువగా ఉండే మండపాల వీధి, చిన్నబజారు, ఆచారివీధి, మినీ బైపాస్‌రోడ్డులోని జ్యూవెలరీ షోరూముల్లో కొనుగోలుదారుల సందడి కనిపించింది. ప్రతి దుకాణంలో లక్ష్మీపూజ చేశారు. బంగారం ధర కూడా తగ్గడంతో వ్యాపారం పెరిగిందని, రమారమి రూ.25 కోట్ల నుంచి రూ.30కోట్ల వ్యాపారం జరిగిందని వ్యాపారుల అంచనా.

కనుల పండువగా లక్ష మల్లెల పూజ

నెల్లూరు (సాంస్కృతికం/వెంకటేశ్వరపురం), మే 10 : అక్షయ తృతియ సందర్భంగా నగరంలోని సంతపేట వ్యాసరాజ మఠంలోగల రమా సమేత సత్యనారాయణ స్వామికి శుక్రవారం లక్ష మల్లెల పూజ కన్నుల పండువగా జరిగింది. ఉదయం స్వామివార్లకు సుప్రభాతం, గణేశ, నవగ్రహ పూజ, సత్యనారాయణ వ్రతం జరిగాయి. ఈ కార్యక్రమంలో కంబాలూరు నరసింహ శ్రీధర్ ఆచార్యులు, రాఘవేంద్ర మఠం నుంచి రంగబాబు, సింహపు మధ్వ సంఘం ఉభయకర్తలుగా వ్యవహరించారు. మఠం మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు, నిర్వాహకులు అరవపల్లి సుబ్బారావు పర్యవేక్షించారు.

వెంకటేశ్వరపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోనూ లక్ష మల్లెల పూజ వైభవంగా జరిగింది. సామూహి కంగా జరిగిన ఈ పూజలో పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాయిభరద్వాజ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి చిమటా శేషగిరిరావు, హరిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించినట్లు ఆలయ చైర్మన్ నాగిరెడ్డి తెలిపారు.

బిడ్డల భవిష్యత్తు కోసం ఓటెయ్యండి

● ఓటర్లకు పిలుపునిచ్చిన రూరల్ టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మే 10 : మన కోసం కాకపోయిన మన బిడ్డల భవిష్యత్తు కోసమైనా రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావాలని, అందుకు ప్రతి ఒక్కరు ఆలోచించి సైకిల్ గుర్తుపై ఓటేసి చంద్రబాబును సీఎం చేయాలని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. శుక్రవారం నగరంలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గడిచిన ఐదేళ్ల రాష్ట్రంలో జరిగిన నేరాలు, ఘోరాలు, ముందుకు సాగని అభివృద్ధి, మహిళలకు రక్షణ కరువు, నిరుద్యోగులకు అందని ఉపాధి అవకాశాలు వంటి ఎన్నో సమస్యలను చూశామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తిరిగి రాష్ట్రం బాగుపడాలన్నా, మన బిడ్డలకు మంచి భవిష్యత్ దక్కాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు. ఏపీలో చదువుకు నే అనేక మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం బయట ప్రాంతాలకు వలస వెళ్తున్నారని, అక్కడ దయనీయ దుస్థితిలో ఉపాధి పొందుతున్నారని ఆందోళ న వ్యక్తం చేశారు. మన రాష్ట్ర విద్యార్థులకు మన రాష్ట్రంలోనే ఉద్యోగాలు దక్కాలంటే పరిశ్రమలు రావాలని, దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టాలని చెప్పారు. ఇవన్నీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వల్లే సాధ్యమవుతాయన్నా రు. రాష్ట్రానికి బంగారు బాటలు వేసేందుకు రెండు రోజులు మాత్రమే సమ యం ఉందని, ప్రతి ఓటరు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కోటం రెడ్డి కార్యాలయంలో కల్లూరుపల్లికి చెందిన వైసీపీ నాయకుడు శ్రీకొలను సుధీర్‌రెడ్డి టీడీపీలో చేరారు. సజ్జాపురం గ్రామానికి చెందిన నెల్లూరు దయా కర్, కావటి చిన్నా మిత్ర బృందాలను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.


శ్రేయ సంస్థ ఉద్యోగులతో మాట్లాడుతున్న రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి


టీడీపీలో చేరిన సజ్జాపురం గ్రామస్థులతో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755


ఎన్నికల్లో ఎర్ర డబ్బు

ఈ ఎన్నికల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఎర్రచందనం డబ్బులు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఐదేళ్లుగా విచ్చలవిడిగా సాగుతున్న స్మగ్లింగ్‌కు అండగా నిలబడ్డ అధికారపార్టీ నేతలకు నిధులు వరదలా పోగయ్యాయని తెలుస్తోంది. చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, చంద్రగిరి, పీలేరు, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాల్లో ఓట్ల కోసం పంచుతున్న డబ్బులో అధికభాగం ఎర్రడబ్బే అని ప్రచారం జరుగుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నాడు
టీడీపీ
హయాంలో
ఉక్కుపాదం

నేడు
వైసీపీ
పాలనలో
స్మగ్లర్లకు
టికెట్లు



తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో యథేచ్ఛగా ఖర్చు పెడుతున్న వైసీపీ అభ్యర్థులు

చంద్రబాబు పాలనలో

దడదడలాడించిన టాస్క్‌ఫోర్స్

2013లో కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినా 2014లో చంద్రబాబు సీఎం కాగానే దాన్ని బలోపేతం చేశారు.స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రత్యేక జ్యూరిస్‌డిక్షన్, ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. బలగాల సంఖ్యను 200కు పెంచి అదనపు ఎస్పీ, డీఎస్పీలను నియమించారు. ఆయుధాలు, వాహనాలు సమకూర్చారు. సీనియర్ ఎస్పీ స్థాయి అధికారిని అధిపతిగా నియమించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. శేషాచలంలో వాచ్‌టవర్లు, చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. ఇన్‌ఫార్మర్ వ్యవస్థ పటిష్టమైంది. నిరంతరం కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించారు. 2015 ఏప్రిల్ 7న శేషాచలం అడవుల్లోని చీగటీగల కోనలో టాస్క్‌ఫోర్స్ బలగాలకూ, స్మగ్లర్లకూ నడుమ పోరాటమే జరిగింది. పలువురు సిబ్బంది గాయపడ్డారు. టాస్క్‌ఫోర్స్ కాల్పుల్లో 20మంది తమిళ స్మగ్లర్లు చనిపోయారు. ఈ ఘటనతో తమిళనాడు స్మగ్లర్లు శేషాచలంలోకి అడుగుపెట్టడం ఆగిపోయింది. టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎక్కడెక్కడి స్మగ్లర్లనూ అరెస్టు చేశారు.ఆ క్రమంలో అంతర్జాతీయ సంబంధాలు కలిగిన కొమ్ములు తిరిగిన స్మగ్లర్ మార్కొండన్ లక్ష్మణ్‌ను చెన్నైలో అరెస్టు చేయడంతో దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ ఛిన్నాభిన్నమైంది.అతడు జైల్లో వుండగా అతడి తరపున ఇంటర్నేషనల్ స్మగ్లింగ్ రాకెట్ నడిపిన లక్ష్మణ్ భార్య మాజీ ఎయిర్ హోస్టెస్, మోడల్ సంగీతా ఛటర్జీతో సహా తమిళనాడు మహిళా స్మగ్లర్ జ్యోతి వంటి వారు సైతం చిత్తూరులో జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చింది. కడప, చిత్తూరు జిల్లాల్లో పాతుకుపోయిన స్మగ్లర్లు రెడ్డి నారాయణ, భాస్కర నాయుడు, మహేష్ నాయుడు, ఎంసీ విజయానందరెడ్డి (ప్రస్తుత చిత్తూరు వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి) వంటి వారు కూడా పీడీ యాక్ట్ కింద సెంట్రల్ జైలు పాలయ్యారు. ఈ విషయంలో చంద్రబాబు తన మన అన్న వివక్ష చూపలేదు. చిత్తూరులో టీడీపీ ముఖ్యనేత వసంత నాయుడు సైతం పీడీ యాక్టు కింద అరెస్టయ్యారు.

వైసీపీ ప్రభుత్వంలో

ఎర్ర దొంగలకు పదవులు

2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రావడంతో పరిస్థితి పూర్తిగా తారుమారైంది. పేరుకు టాస్క్‌ఫోర్స్‌లో సిబ్బంది సంఖ్య 200 నుంచీ 350కి పెరిగినా కార్యకలాపాలు స్తంభించిపోయాయి.ప్రభుత్వం నుంచీ సమీక్ష గానీ, ఒత్తిడి గానీ లేకపోవడంతో టాస్క్‌ఫోర్స్ నామమాత్రమైంది. ఇన్‌ఫార్మర్ల వ్యవస్థ నిర్వీర్యమైంది. కూంబింగ్ ఆపరేషన్లు ఆగిపోయాయి. చెక్‌పోస్టుల్లో తనిఖీల తీవ్రత తగ్గింది. దీంతో ఎర్రచందనం స్మగ్లర్లు కూలీలతో శేషాచలంలోనే శాశ్వతంగా తిష్ట వేశారు. వీరి ధాటికి శేషాచలం అడవుల్లో సరిహద్దుల నుంచీ 20 కిలోమీటర్ల లోపలికి ఎర్రచందనం చెట్టన్నదే కనిపించకుండా పోయింది. అడపాదడపా అడ్డుకునేందుకు యత్నించిన పోలీసు, అటవీ శాఖల సిబ్బందిపై స్మగ్లర్లు దాడులకు దిగుతున్నారు.ఈ ఏడాది ఫిబ్రవరి 6న పీలేరు నియోజకవర్గం కేవీపల్లి మండలంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా స్మగ్లర్లు వాహనంతో ఢీకొట్టగా గణేష్ అనే కానిస్టేబుల్ మరణించాడు. అదే సమయంలో వైసీపీ ముఖ్యనేతల అండదండలతో పీలేరు, చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో స్మగ్లర్లు అధికార పార్టీ నేతలుగా ఎదిగారు. పలువురు ప్రజాప్రతినిధులుగా మారారు. ఉదాహరణకు తిరుపతి రూరల్ మండలం సప్తగిరి నగర్ పంచాయతీ ఉపసర్పంచ్‌గా వున్న వైసీపీ నేత అశోక్‌కుమార్ రెడ్డి గతంలో పీడీ యాక్టు కింద అరెస్టయ్యారు.అదే మండలం తిరుమలనగర్ సర్పంచ్‌గా వున్న వైసీపీ నేత శివశంకర్ రాజుపై కూడా గతంలో ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి. చిత్తూరులో అధికార పార్టీ ఎర్రచందనం స్మగ్లరుగా పీడీ యాక్టు కింద అరెస్టయిన విజయానందరెడ్డికి ప్రస్తుత ఎన్నికల్లో ఏకంగా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం దీనికి పరాకాష్ఠ.



2014లో పీడీ యాక్టు కింద అరెస్టయినప్పుడు చిత్తూరు పోలీసు స్టేషన్‌లో విజయానందరెడ్డి (ప్రస్తుత చిత్తూరు వైసీపీ అభ్యర్థి), భాస్కర నాయుడు, రెడ్డినారాయణ, మహేష్ నాయుడు

అంకెలు చెబుతున్న నిజాలు!

ఏడాది	కేసులు	నిందితులు	దుంగలు	బరువు	వాహనాలు
2015	114	497	2993	78.275 టన్నులు	74
2016	146	482	3425	96.579 టన్నులు	76
2017	103	460	2471	68.204 టన్నులు	38
2018	122	268	1802	50.641 టన్నులు	54
2019	76	140	956	25.167 టన్నులు	37
2020	28	81	668	19.030 టన్నులు	26

గత టీడీపీ ప్రభుత్వంలోనూ, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలోనూ టాస్క్‌ఫోర్స్ పనితీరు ఎలా వుండేదో కింది అంకెలే చెబుతున్నాయి. 2019 నుంచే టాస్క్‌ఫోర్స్ ప్రభావం నామమాత్రం కావడంతో అప్పటి నుంచీ కేసుల వివరాలు మీడియాకు వెల్లడించడం లేదు. పురోగతి ఏమీ లేదనడానికి అధికారులు పాటిస్తున్న గోప్యతే నిదర్శనం

2014కు మునుపు చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఎర్రచందనం వృక్షాల నరికివేత, అక్రమ రవాణా యథేచ్ఛగా సాగింది. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నేతల అండదండలతో స్మగ్లర్లు రెచ్చిపోయి వ్యవహరించారు. ఆ పార్టీ నేతలకు వాటాలిస్తూ రూ. కోట్లకు పడగలెత్తారు. 2014 తర్వాత ఎర్రచందనం స్మగ్లర్లలో 90శాతం మంది వైసీపీకి అనుకూలంగా మారిపోయారు. అందుకు ప్రధాన కారణం ఎర్రచందనం స్మగ్లింగ్ మీద టీడీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం. పీడీ యాక్ట్, అరెస్టులు పెరగడంతో వీరికి రాజకీయ ఆశ్రయం అవసరమైంది. దాని ప్రభావం 2019 ఎన్నికల్లో కనిపించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎర్రచందనం స్మగ్లర్లు భారీఎత్తున వైసీపీ గెలుపు కోసం డబ్బు ఖర్చు పెట్టారు. జీడీనెల్లూరులో పార్టీ విజయానికి వంద శాతం ఖర్చు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. అక్కడి అభ్యర్థిగా వుండిన ప్రస్తుత డిప్యూటీ సీఎం నారాయణస్వామితోనూ, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డితోనూ ఎర్రచందనం కేసుల్లో పీడీ యాక్ట్ కింద అరెస్టయిన విజయానందరెడ్డి సన్నిహితంగా మెలిగేవారు. చంద్రగిరి, చిత్తూరు, పీలేరు, తిరుపతి నియోజకవర్గాల్లో కూడా ఎర్రచందనం స్మగ్లర్లే వైసీపీ గెలుపు కోసం ఆర్థికంగా సహకరించారనే ఆరోపణలు అప్పట్లో వచ్చాయి.ప్రస్తుతం కూడా ఈ నియోజకవర్గాలకు తోడు వెంకటగిరి, శ్రీకాళహస్తిల్లో కూడా ఎర్రచందనం నిధులు అధికార పార్టీకి ప్రధాన ఆర్థిక వనరుగా మారాయన్న ప్రచారం జరుగుతోంది. ఆర్థిక దన్నుగా ఉన్నందునే స్మగ్లర్లు వైసీపీలో నాయకులుగా మారారు. ప్రస్తుతం చిత్తూరు అసెంబ్లీకి విజయానందరెడ్డి వైసీపీ అభ్యర్థిగానే బరిలోకి దిగారు.

జగనన్న పాలన ఘనత

గత హామీల ఊసేది జగన్?

మండే ఎండలో చప్పగా ముగిసిన సీఎం ప్రచార సభ

పుత్తూరు అర్బన్, మే 10: పుత్తూరులో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన సీఎం జగన్ సభలో ఆయన ప్రసంగంలోనూ, మంత్రి రోజా ప్రసంగంలోనూ నియోజకవర్గ అభివృద్ధికి ఏమి చేస్తామనే విషయాన్ని స్పష్టం చేయకపోవడంపై వైసీపీ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. రోజా తాను ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేసేశానని చెప్పుకోవడం తప్ప ప్రత్యేకించి ఫలానా అభివృద్ధి చేశాననే అంశాన్ని ప్రస్తావించకపోవడం పట్ల కూడా ఆ పార్టీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో పాటు జగన్ తన ప్రసంగంలో గత ఎన్నికల సందర్భంగా ఇదే కూడలిలో నిర్వహించిన సభలో ఇచ్చిన హామీలను కూడా ప్రస్తావించలేదు. గాలేరు-నగరి ప్రాజెక్టులో అంతర్భాగమైన వేణుగోపాల సాగర్ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తానని గత ఎన్నికల సందర్భంగా పుత్తూరులో జరిగిన సభలో జగన్ వాగ్దానం చేశారు. తిరిగి అధికారంలోకి వస్తే వాటిని నెరవేరుస్తామని కూడా ఆయన చెప్పకపోవడం వైసీపీ వర్గాలనే అసంతృప్తికి గురిచేసింది. సీఎం షెడ్యూల్ ప్రకారం 45 నిమిషాల పాటు ప్రసంగించాల్సి ఉంది. జగన్ ప్రసంగం ప్రారంభంకాగానే ఎండవేడిమికి తాళలేక పలువురు వెనుదిరగడం కనిపించింది. దీంతో ప్రసంగ సమయాన్ని 30నిమిషాల్లోనే పూర్తి చేశారు.



జగన్ అభివాదం

పింఛన్ కట్ బెదిరింపు....

ఇదిలా ఉండగా సీఎం జగన్ సభ విజయవంతానికి వైసీపీ నాయకులు తీవ్ర కసరత్తే చేశారు. వడమాలపేట మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి పింఛన్ కట్ చేస్తామని బెరించి మరీ సభకు బలవంతంగా తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు వలంటీర్లను వినియోగించినట్లు సమాచారం. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.ట్రాఫిక్ ఆంక్షలు ఉండడంతో సభా ప్రాంగణానికి వచ్చేందుకు కిలోమీటర్ పైన నడవాల్సి వచ్చింది.



ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు

జగన్ రావడానికి రెండున్నర గంటల ముందు నుంచే పుత్తూరులో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేశారు. పుత్తూరు పట్టణం కాపువీధి జంక్షన్‌లో సభ పెట్టడంతో చిత్తూరుకు వెళ్లాల్సిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటు చిత్తూరు నుంచి వచ్చేవారు కూడా వినాయకపురం మీదుగా కనకంపాలెం, మిద్దిగుంట రోడ్డు మార్గంలో పుత్తురుకు రావాల్సి వచ్చింది. 10 నిమిషాల ప్రయాణం గంటన్నర పట్టింది. తిరుపతి-పుత్తూరు మార్గంలో కూడా పోలీసులు ఆంక్షలు పెట్టడంతో వాహనదారులు అగచాట్లు పడ్డారు. బైపాస్‌రోడ్డులోనే బస్సులు, కార్లు నిలిపివేయడంతో పున్నమి సర్కిల్ నుంచి కాలినడకనే పుత్తూరులోకి రావాల్సి వచ్చింది. నగరి నుంచి వచ్చేవారిని కూడా నారాయణవనం బైపాస్ సర్కిల్‌లో నిలిపివేయడంతో ఆటోలపై ఆధారపడాల్సి వచ్చింది. మరోవైపు జగన్ పర్యటన నేపథ్యంలో సభ సమీప ప్రాంతాల్లో దాదాపు గంట సమయం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. తీవ్రమైన ఎండ వేడితో సమీపంలోని ఇళ్లలో నివసించే ప్రజలు అల్లాడిపోయారు.సీఎం సభలో కొందరు మద్యం మత్తులో ఊగిపోతూ వైసీపీ జెండాలు పట్టుకుని హల్‌చల్ చేశారు.

నిరూపిస్తే వదిలి వెళ్లిపోతాం: రోజా

తన అన్నలు ఎక్కడ దోచుకున్నారో చెబితే ఇక్కడ (నగరి నియోజకవర్గం) నుంచి వదిలి వెళతామని సభలో మంత్రి రోజా సవాల్ విసిరారు.చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, గాలి భానుప్రకాష్.. తనను రాజకీయంగా ఎదుర్కొనలేకే ఇలా ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.4

పాఠకుని పూర్తి పేరు : ....
డోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

నెల్లూరు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. కావలి				
2. ఆత్మకూరు				
3. కోవూరు				
4. నెల్లూరు (సిటీ)				
5. నెల్లూరు (రూరల్)				
6. సర్వేపల్లి				
7. గూడూరు (ఎస్సీ)				
8. సూళ్లూరుపేట (ఎస్సీ)				
9. వెంకటగిరి				
10. ఉదయగిరి				
మొత్తం:				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : నెం.91, ఉడ్‌కాంప్లెక్స్, అయ్యప్పగుడి దగ్గర, వేదాయపాలెం, నెల్లూరు-524004.

అప్పుడే.. కాయ్ రాజా కాయ్ !



పోలింగ్ ఇంకా పూర్తి కానే లేదు.. అప్పుడే కందుకూరు నియోజకవర్గంలో అభ్యర్థుల విజయంపై గ్రామాల్లో జోరుగా పందేలు కాస్తున్నారు. ఎన్డీఏ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు, వైసీపీ తరఫున బుర్రా మధుసూదన్‌యాదవ్ పోటీ చేస్తుండగా, విజయం మాదంటే మాదంటూ ఇరు పార్టీల గ్రామస్థాయి నాయకులు రూ. లక్షల్లో పందేలు కాస్తున్నారు. అంతేకాకుండా ఒంగోలు, నెల్లూరు, నరసారావుపేట ఎంపీ అభ్యర్థుల విజయంపై కూడా జోరుగా పందేలు కాస్తు న్నారు. అధికారపార్టీ నేతలు పందేలకు వెనుకడుగు వేస్తుండగా, కూటమి నాయకులు సైసై.. అంటున్నారు. కూటమి అభ్యర్థి తరఫున రూ.లక్షకు లక్షన్నర ఇస్తామంటూ సవాల్ విసురుతున్నారు.

● కొత్త చుట్టాలొస్తున్నారు... !

బాగున్నావా అక్కా...? ఎలా ఉన్నావు చెల్లీ.. ఏంటీ అవ్వా.. కులాసానా... తాతా ఏం చేస్తున్నావ్.. తల్లీ... అబ్బాయెక్కడ.. ? ఇలా గ్రామాల్లో ప్రచారానికి వచ్చిన నేతలు ప్రేమలు ఒలకపోస్తూ ఓటర్లను పలకరిస్తున్నారు. పరిచయం ఉన్నా లేకున్నా అందరినీ వరుసలతో పలకరిస్తున్నారు. ఇవి రాజకీయ పలకరింపులని వాళ్లకీ తెలుసు.. వీళ్లకీ తెలుసు. గతంలో అభ్యర్థులే స్వయంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లకు నమస్కారం పెట్టి తమ గుర్తు చెప్పి ఓటు అడిగేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. కొత్త చుట్టాల్లా వచ్చి ఓటు అడుగుతున్నారు.

● ఎంత ఇద్దాం... ?

ఈ సారి ఓటుకు ఎంత ఇద్దాం.. అని రాజకీయ నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎదుట పార్టీ వారు ఇచ్చిన తరువాత మనమూ ఇద్దాంలే... అని అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఎదురు చూస్తున్నారు అయితే ఎవరు ముందు డబ్బులు పంపిణీ చేస్తారా ...? అంటూ నిరీక్షిస్తున్నారు. డబ్బులతో పాటు మద్యం కూడ ఇస్తే బాగుంటుందనుకుంటున్నారు. అయితే అందరి దగ్గర డబ్బులు తీసుకుని తమకు నచ్చినవారికి ఓటు వేద్దామని ప్రజలు భావిస్తున్నారు.

- పలేటివారిపాలెం

ఓటుకు భలే రేటు!



పెద్ద నోట్లు రద్దు చేశారనే మాటే కానీ, ఈసారి ఎన్నికల్లో ప్రజలకు ఓటుకు రేటు మాత్రం బాగానే గిట్టుబాటు అయ్యింది. వారు, వీరు అనే తేడా లేకుండా అభ్యర్థులు పోటీ పడి ప్రజలకు డబ్బులు పంచిపెడుతున్నారు. ఏ పార్టీ సానుభూతిపరులు, ఓటు వేస్తారా!? లేదా!? అనే పరిశీలన లేకుండా పంపకాల్లో వారు వీరు అనే వివక్ష లేకుండా ప్రధాన పార్టీలన్నీ సమానంగా ప్రజలను ప్రలోభపెట్టే పనిలో విజయవంతం అవుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి జిల్లా వ్యాప్తంగా 70 శాతం పంపకాలు పూర్తయ్యాయి. మిగిలిన 30 శాతం కూడా ఈ రాత్రికే కంప్లీట్ కానుంది. నెల్లూరులో రూ.3వేలు, ఉదయగిరిలో రూ.5వేల వరకు ఒక్కో ఓటుకు పంచుతున్నారు. ఇక కోవూరు నియోజకవర్గంలో గ్రామాలనే కొనుగోలు చేసుకున్నంతస్థాయిలో ఉంటోంది. ఈసారి ఎన్నికల్లో విశేషం ఏమంటే ఎలాంటి ప్రతిఘటనలు లేకుండా ప్రశాంతంగా హాయిగా పంపకాలు జరగడం. చాలా నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులు ఇద్దరూ ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ లేకుండా కలిసి ఒప్పందం చేసుకున్నట్లు ఒకే రేటు ఫిక్స్ చేసి పంచిపెట్టారు. పంచిపెడుతూనే ఉన్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

మండల కేంద్రాల్లో రూ.2వేలు, గ్రామాల్లో రూ.1,500

అడ్డగింతలు లేవు.. అడ్డుకునేవారూ లేరు!

సిటీ, రూరల్‌లో పోటాపోటీగా..

నెల్లూరురూరల్ : ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు పోటాపోటీగా నగదు పంపిణీ చేస్తున్నాయి. నెల్లూరురూరల్లో ఓటరుకు రూ.2 వేలు చొప్పున, సిటీలో ఓ పార్టీ అభ్యర్థి ఓటుకు రూ. 3 వేలు ఇవ్వగా, మరో పార్టీ అభ్యర్థి రూ. 2 వేలు చొప్పున అందచేశారు. శుక్రవారం ఉదయం నుంచి అటు గ్రామాలలో, ఇటు మున్సిపల్ డివిజన్లలో పోటాపోటీగా పంపిణీ జరుగుతోంది. కొన్ని ప్రాంతాలలో ఈ పంపిణీ విషయమై కొందరు నాయకుల మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో నేతలు రంగంలోకి దిగి సర్దుబాట్లు చేస్తున్నారు.

కావలిలో నగదు, మద్యంతో ఎర

కావలి : కావలి నియోజకవర్గంలోని ప్రధాన పార్టీలతోపాటు ఓ స్వతంత్ర అభ్యర్థి కూడా ఓటర్లకు ఎర వేస్తున్నారు. ఇప్పటివరకు అసంతృప్త నాయకులను బుజ్జగిస్తూ వారికి ప్యాకేజీలు ఇస్తూ కాపాడుకుంటూ వచ్చిన నేతలు ఇప్పుడు పోలింగ్ కోసం ఓటర్లపై దృష్టి పెట్టారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటుకు రూ.2వేలు వంతున ఇస్తూ ఇప్పటికే రెండుభాగాలపైన పంపిణీ పూర్తి చేశారు. ఓ స్వతంత్ర అభ్యర్థి మాత్రం కొన్ని ప్రాంతాలను మాత్రమే ఎంపిక చేసుకుని ఓటుకు వెయ్యి రూపాయల వంతున పంపిణీ చేస్తున్నారు. అయితే మద్యం సరఫరాలో మాత్రం అధికార పార్టీ ముందంజలో ఉంది. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు అధికార పార్టీ నేతల కనుసన్నలలో ఉండటంతో వాటి నుంచి నేరుగా మద్యం కేసులను నాయకులకు పంపేస్తున్నారు. ఇక ప్రధాన పార్టీలలో అసంతృప్తి నాయకులను బుజ్జగించి సర్దుబాటు చేస్తున్నారు. కొందరైతే బుజ్జగింపులకు సర్దుకు పోతుండగా మరికొందరు ప్రత్యర్థి పార్టీల నుంచి ప్యాకేజీలు తీసుకుని పార్టీలు మారుతున్నారు.

కానరాని దురాయి

తీరప్రాంతంలో ఒకప్పుడు మత్స్యకారులు దురాయి వేసుకుని ఒకరికే ఓట్లన్నీ గుంపగుత్తగా వేస్తుండేవారు. అయితే, ప్రస్తుతం అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించలేదు. అధికార పార్టీ నాయకులు మాత్రం ఆ విధానానికి తెరలేపుతున్నా సున్నితంగా తిరస్కరిస్తున్నట్లు సమాచారం.

'గిరి'లో ఓటుకు రూ.5వేలు

ఉదయగిరి : ఓటర్లను ఆకట్టుకునేందుకు రెండు రోజుల నుంచి తాయిలాల పంపిణీ సాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ అనుచరుల ద్వారా డబ్బులను పంపిణీ చేశారు. గ్రామస్థాయిని బట్టి రూ.1,500 నుంచి రూ.5వేల దాకా పంచుతున్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాను ముందేసుకుని లెక్కలు తీసి మరి పంపకాలు సాగిస్తున్నారు. బూత్ కమిటీ సభ్యులు తమ ప్రాంతాల్లో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నాయకులకు అందజేస్తున్నారు. ఆ తర్వాతే డబ్బుల పంపకాలు ఉంటున్నాయి. మరోవైపు డబ్బులతోపాటు మద్యాన్ని కూడా పంపిణీ జోరుగా సాగుతోంది.

ఆత్మకూరులో బెట్టింగ్‌ల జోరు

ఆత్మకూరు : సర్వేలు, అంచనాలతో వాతావరణం వేడెక్కడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల విజయావకాశాలపై బెట్టింగులు జోరందుకున్నాయి. ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, మర్రిపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో బెట్టింగుల జోరు కొనసాగుతోంది. అభ్యర్థుల విజయ అవకాశాలతోపాటు ఏ మండలంలో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందో అనే అంశంపైనా బెట్టింగులు కాస్తున్నారు. ఇక ఓటర్ల జాబితా ఆధారంగా ఓటుకు రూ.2000 ఇవ్వడానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో గల్లీ లీడర్లు ఓటుకు కొంత మొత్తాన్ని ముట్టజెపుతూ తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. కాగా, నూరు శాతం ఓటర్లకు రూ.2000 వంతున పంపిణీ చేయానికి కొందరు ద్వితీయశ్రేణి నాయకులు డిమాండ్ చేస్తున్నా 60 శాతం నుంచి 75 శాతం ఓటర్లకు మాత్రమే నగదు ఇస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని మండలాల్లో ఓటర్లకు డబ్బు పంపకం గుట్టుచప్పుడు కాకుండా మొదలు పెట్టారు. మరోవైపు పోలీసుల తనిఖీలు ముమ్మరంగా జరుగుతుండటంతో నగదు తరలించడం, సర్దుబాటు చేయడం అభ్యర్థులకు తలభారంగా మారింది. సొమ్ము, మద్యం, తాయిలాలు పోలీసుల కంట పడకుండా క్షేత్రస్థాయికి చేర్చడానికి ఆపసోపాలు పడుతున్నారు.

కందుకూరులో రెండ్రోజుల నుంచే!

కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో ఇరు పార్టీలు రెండు రోజుల క్రితం నుంచే తాయిలాలు పంపిణీలో తనమునకలయ్యాయి. కందుకూరు పట్టణం, మండల కేంద్రాలలో ఓటుకు రూ.3వేలు, గ్రామాల్లో 2వేలు వంతున పంపిణీ చేస్తున్నారు. ఎంపిక చేసుకున్న గ్రామాల్లో ఎక్కువ ఓటర్లకు డబ్బు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ప్రబావితం చేయగల నాయకు లకు స్పెషల్ ప్యాకేజీలూ ఇస్తున్నారు. పోలీసులు ఇబ్బంది పెట్టకుండా వారికి కూడా పెద్ద మొత్తంలో ముట్టజెప్పినట్లు సమాచారం.

'సర్వేపల్లి'లో ఇప్పటికే మందు!

వెంకటాచలం : సర్వేపల్లిలో ఓటుకు నోటు పర్వం మొదలు పెట్టక ముందే గ్రామాల్లో మందు పర్వం కొనసాగుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఈ కార్యక్రమంలో బిజీగా ఉన్నారు. అయితే ఈ పంపిణీ తలనొప్పిగా పరిణమిస్తున్నదని అభ్యర్థులు, స్థానిక నేతలు వాపోతున్నారు. నగదు పంపిణీ ఒక్కసారితో ముగిసిపోతుంది. అయితే మందు పంపిణీ మాత్రం పోలింగ్ రోజు వరకు కొనసాగించాల్సి వస్తున్నదని వారు వాపోతున్నారు. ఇటీవల ముత్తుకూరు, పొదలకూరు మండలాల్లో వైసీపీ నేతలు భారీ ఎత్తున నిల్వ ఉంచిన మద్యాన్ని సెబ్ అధికారులు సీజ్ చేసి వైసీపీ కీలక నేతలు, వారి అనుచరులను అదుపులోకి తీసుకొని జైలుకు పంపించారు. దీంతో మద్యం నిల్వ ఉంచడం, పంపిణీ చేయ డం వంటివి చేస్తు న్న నేతల్లో గుబులు పట్టుకుంది.

కోవూరులో గ్రామాలకు గ్రామాలే!

కోవూరు : నియోజకవర్గంలోని ఓటర్ల ముంగిటకే ప్రలోభాలు చేరడం ప్రారంభించాయి. ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి తరఫున ఒక్కో ఓటుకు రూ.2500 ఇస్తుండగా, మరో ప్రధాన పార్టీ నాయకులు రూ.2వేలు చొప్పున అందిస్తున్నారు. ఓ పార్టీ నాయకులు వలంటీర్ల ద్వారా తమకు ఓటేస్తారని భావించే ఓటర్లకు మాత్రమే నగదు పంపిణీ చేస్తున్నారు. ఒక్కో వార్డులో 60 శాతం మందికి మాత్రమే పంపిణీ చేయాలని నాయకులు భావిస్తు న్నారు. విడవలూరు మండలంలోని కొన్ని గ్రామాలలో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్కో ఓటు కు రూ.10వేల నుంచి 12వేలు చొప్పున అంద జేసిన తెలిసింది. ఇందుకూరుపేట మండలం లోని ఓ గ్రామాన్ని రెండు వారాల కిందటే ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి పెద్ద మొత్తంలో చెల్లించి కొనుగోలు చేసుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఓ ప్రధాన పార్టీ నాయకులు ఓటర్లకు భారీగా మద్యం పంపిణీ చేశారు..

నేనూ ఓటేస్తా...!

అబ్బాయ్ : ఓటు వేయడం మన బాధ్యత బాబాయ్..

బాబాయ్ : ఏందిరా బాధ్యత..? డబ్బులిస్తే ఓటు వేస్తా.. లేకుంటే లేదు.

అబ్బాయ్ : బాబాయ్... నేను డబ్బులు తీసుకోను. అయితే ఓటు మాత్రం నచ్చినవారికి వేస్తా..

బాబాయ్ : ఏందిరా అబ్బాయ్.. మొన్న పండక్కి రాలేదు. ఇప్పుడు పండగల్లేవు.. సెలవులేమైనా ఇచ్చారా? ఏంటీ..?

అబ్బాయ్ : లేదు.. లేదు.. బాబాయ్.. ఈనెల 13వ తేదీ ఓటు వేయాలని సెలవు పెట్టి మరీ వచ్చా.

బాబాయ్: ఓరి పిచ్చోడా... ఇక్కడ డబ్బులు ఇవ్వరంట. ఓటు వేయడానికి అనవసరంగా ఖర్చు పెట్టుకుని వచ్చావ్.

అబ్బాయ్ : నేను డబ్బుల కోసమో.. ఇంక దేనికోసమో రాలేదు బాబాయ్... రాజ్యాంగం నాకు ఇచ్చిన హక్కును వినియోగించుకోవడానికి ఎంతో కష్టపడి వచ్చా..

బాబాయ్ : ఏందిరా కష్టపడడం... నాయకులే డబ్బులు ఇచ్చి ఓటు వేయమని మన చుట్టూ తిరుగుతుంటే...

అబ్బాయ్ : ఆ హక్కు మనకు అంత తేలికగా రాలేదు. దాన్ని పోరాడి తెచ్చుకున్నాం.

బాబాయ్: అది స్వాతంత్ర్యం కదరా...? ఓటు ఏంటీ ?

అబ్బాయ్ : బాబాయ్... అప్పట్లో మనకు ఓటు ఉండేది కాదు.. రాజ్యాంగం లేదు... అప్పటి పాలకులు మనల్ని బానిసలు చేసి అండించేవాళ్లు. దాంతో మన వాళ్లు పోరాటాలు చేసి స్వాతంత్ర్యం తెచ్చి, రాజ్యాంగం ద్వారా ఓటు హక్కు కల్పించారు.

బాబాయ్ : అవునురా...? అబ్బాయ్ ? నేనూ ఓటేస్తా.. డబ్బులు గిబ్బులు వద్దు... బాధ్యతతో ఓటేస్తా...!

- ఏఎస్‌పేట





బాటిల్ కోసం బారులు

● నేటి సాయంత్రం నుంచి మందు బంద్!

● తిరిగి 14న తెరుచుకోనున్న దుకాణాల తలుపులు

● ముందురోజు క్యూ కట్టిన మందుబాబులు



ఉదయగిరి రూరల్: దుకాణాల వద్ద మద్యం కోసం బారులు తీరిన మందుబాబులు

ఉదయగిరి రూరల్, మే 10 : శనివారం సాయంత్రం తర్వాత మద్యం దుకాణాలు మూతపడతాయి. రెండ్రోజుల తర్వాత దుకాణాల తలుపుతు తెరుచుకుంటాయి. మధ్యలో ఆదివారం. ఇంకేముంది... మద్యం దుకాణాల ముందు మందుబాబులు క్యూకట్టారు. ఉదయగిరి నియోజకవర్గంలో శుక్రవారం మద్యం దుకాణాలు మందుబాబులతో కిక్కిరిసిపోయాయి. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. దీంతో దుకాణాల్లో అమ్మాల్సిన కోటా మధ్యాహ్నం 12 గంటలకే పూర్తవుతోంది. ఆ తరువాత మద్యం కావాలంటే బ్లాక్‌లో అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. మరోవైపు పోలింగ్‌కు సమయం దగ్గరపడడం, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు మద్యం బదులు డబ్బులు అందజేస్తున్నారు. దీంతో నగదు చేత పట్టుకుని మందుబాబులు దుకాణాల వద్ద ఉదయం నుంచే బారులుతీరుతున్నారు. శుక్రవారం ఉదయగిరిలోని మూడు మద్యం షాపుల వద్ద మందుబాబులు బారులుతీరారు. షాపుల్లో లక్ష్యం పూర్తి కావడంతో సిబ్బంది మధ్యాహ్నానికే దుకా ణాలను మూసివేయడం, గంటల కొద్దీ క్యూలో నిలబడినా మద్యం దొరక్క పోవడంతో మందుబాబులు నిరాశతో వెనుతిరిగారు.



మందు దొరుకుతుందో లేదో!



ఎర్రటి ఎండలో అవస్థలు పడుతూ..

● అధిక ధరలకు విక్రయాలు

మద్యం అమ్మాల్సిన లక్ష్యం పూర్తి కాగానే దుకాణాలు మూతపడుతున్నాయి. కొంత మంది మద్యం బెల్టు నిర్వాహకులు ఇదేతం తుగా భావించి తమ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకొని ఒక్కో బాటిల్‌కు రూ.10 చొప్పున అందజేసి దుకాణాల నుంచి మద్యం తెప్పించుకుంటున్నారు. అనంతరం బ్లాక్‌లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అవసరాన్ని బట్టి క్వార్టర్‌పై రూ.100 నుంచి 150 అదనపు ధరకు విక్రయిస్తున్నారు.

● వరికుంటపాడులో ఉద్రిక్తత

వరికుంటపాడు : మద్యం అమ్మకాలపై ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలు అధికార పార్టీ నాయకులు, దుకాణ సిబ్బంది కి వరంగా మారుతోంది. నాయకుల అవస రాన్ని ఆసరా చేసుకొని జేబులు నింపుకుం టున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని వరికుంటపాడు, తిమ్మారెడ్డి పల్లి, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో షాపుల నుంచి మద్యం పక్కదారి పడుతోంది. ముఖ్యంగా పెద్దిరెడ్డిపల్లిలో అధికార పార్టీ నాయకులు చెప్పిందే వేదంగా అనుకూల వ్యక్తులకు మద్యం ఇస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రభు త్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తిస్థాయి మద్యాన్ని తమకే కేటాయించాలని అధికార పార్టీ నాయకులు తమదైన శైలిలో సిబ్బందికి హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ వర్గీయులతోపాటు మద్యంప్రియులు శుక్రవారం ఉదయాన్నే మద్యం దుకాణం వద్దకు భారీస్థాయిలో చేరుకొని క్యూ కట్టారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా గంటల తరబడి బారులు తీయడంతో తొక్కిసలాట నడుమ ఉద్రిక్తత నెలకొంది. దీంతో మొక్కుబడిగా ఏర్పాటు చేసిన బారికేడ్లు సైతం విరిగిపోయాయి. అందిన ఫిర్యాదుల మేరకు ఎస్ఐ తిరుపతయ్య తన సిబ్బందితో హుటాహుటిన దుకాణం వద్దకు చేరుకుని అమ్మకాలు పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కోటేశ్వరరావు సైతం అక్కడికి చేరుకొని మద్యం అమ్మకాలను పర్యవేక్షించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

● సీతారామపురంలో తోపులాట

సీతారామపురం : సీతారామపురం గ్రామ పంచాయతీలో శుక్రవారం రెండు మద్యం దుకాణాల వద్ద ఉద్రిక్తత నెలకొంది. మద్యం కొనుగోలు చేసే వారి మధ్య తోపులాట జరిగింది. మద్యం విక్రయాలు లక్ష్యం పూర్తి కాగానే దుకాణాలు మూసేస్తున్నారు. ఈ క్రమంలో తమకు మద్యం దొరుకుతుందో లేదోనన్న ఆత్రుతతో మద్యం ప్రియులు బారులుదీరారు. దీనికితోడు సిబ్బంది ఓ వర్గానికే మద్యం విక్రయిస్తున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు.



ఉదయగిరి రూరల్: దుకాణాల వద్ద మద్యం కోసం బారులుతీరిన మందుబాబులు


ఎన్నికలకు పటిష్ట భద్రత

● 450 సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

● ప్రతి సెగ్మెంట్‌కు డీఎస్పీ స్థాయి అధికారి

● ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి

● జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్



నెల్లూరు(క్రైం). మే 10: ప్రజలంతా నిర్భయంగా, శాంతి యుత వాతావరణంలో ఓటు వేసేలా సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ కె ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. పోలీసు అతిథి గృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 2,470 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలు జరుగుతు న్నాయని చెప్పారు. వీటిల్లో 450 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించామని, కేంద్ర బలగాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ముందస్తుగా రౌడీషీటర్లతోపాటు ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల సమయంలో కేసుల్లో ఉన్న సుమారు 10,485 మందిని బైండోవర్ చేశామన్నారు. ఎన్నికలు ముగిసేంత వరకు వీరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. జిల్లాలో 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, 26 ఫ్లైయింగ్‌స్క్వాడ్‌లు, 26 ఏఎస్‌టీలు, 46 ఎంసీసీ, 105 క్యూఆర్‌టీ బృందాలతో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని వివరించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి రూ.2,72,31,845 నగదు, రూ.2,72,054 విలువ చేసే ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. 663 కేసుల్లో రూ.30,56,981 విలువ చేసే 3990.04 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 10కేసుల్లో పొరుగు రాష్ట్రాలకు చెందిన 205.8 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు. నాటు సారాపై దాడులు చేసి 37.5 లీటర్లను స్వాధీనం చేసుకున్నామని, 28,700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని చెప్పారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై ఇప్పటివరకు 67 కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల ప్రలోభాలపై సీవిజిల్ యాప్, 1950 హెల్ప్‌లైన్, డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

● బందోబస్తుకు 4వేలకుపైగా సిబ్బంది

ఎన్నికల బందోబస్తుకు 4వేల మందికిపైగా సిబ్బంది ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పోలీసులతోపాటు విశ్రాంత పోలీసులు, ఆర్మీ అధికారులు, ఎన్‌సీసీ అధికారులతో పాటు 4ప్లటూన్ల బీఎస్ఎఫ్ బలగాలు, 4కంపెనీల తమిళనాడు రాష్ట్ర ఆర్మెడ్‌ఫోర్స్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు.

● ఒక్కో సెగ్మెంట్‌కు డీఎస్పీ స్థాయి అధికారి

ప్రతి నియోజకవర్గానికి డీఎస్పీ స్థాయి అధికారిని ప్ర త్యేక అధికారిగా నియమించామన్నారు. నెల్లూరు అసెంబ్లీ స్థానానికి నెల్లూరు డీఎస్పీ, రూరల్‌కి ట్రాఫిక్ డీఎస్పీ, కోవూరుకి దిశ డీఎస్పీ, సర్వేపల్లికి నెల్లూరు రూరల్ డీఎస్పీ, కావలికి కావలి డీఎస్పీ, ఆత్మకూరుకి ఆత్మకూరు డీఎస్పీ, ఉదయగిరి, కందుకూరులకు కందుకూరు డీఎస్పీ, వెంకటగిరి పరిధిలోని మండలాలకు ఏఆర్ డీఎస్పీని ప్రత్యేక అధికారిగా నియమించామని చెప్పారు.

ఏజెంట్లు కోవర్టులైతే.. అంతే సంగతులు !

కస్సా బుస్సా !

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పడిన కష్టానికి ఆ ఒక్కరోజే ఫలితం దక్కనుంది. పోలింగ్ రోజున బూత్‌లో కూర్చొని దొంగఓట్లను నిరోధించే పోలింగ్ ఏజెంట్ల చేతిలోనే అభ్యర్థుల భవిత ఉంటుంది. బోగస్ ఓట్లు పడకుండా చూడటం.. పోలింగ్ సక్రమంగా జరుగుతుందా... లేదా ? అని గమనించడం పోలింగ్ ఏజెంట్ల బాధ్యత. పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని అతను నిశితంగా పరిశీలించాలి. అనుమానం వస్తే ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లాలి. కావున నమ్మకమైనవారినే ఏజెంట్‌గా అభ్యర్థులు ఉంచుతారు. ఒకవేళ ఏజెంట్ అవతల పార్టీకి కోవర్టుగా మారినా, బెదిరింపులు, డబ్బుకు లొంగినా అభ్యర్థికి ఇక అంతే సంగతులు.


- ఉదయగిరి



నిజాయితీ ఓటర్లకు నీరాజనాలు

ఓటు కోసం ఎవరెంతిస్తారా అని ఎదురుచూస్తున్న రోజుల్లో తాము అమ్ముడుపోయేదే లేదంటూ కొందరు ముందుకు రావడం ఆశ్చర్యమే. అందుకేనేమో ఓ పార్టీ నాయకులు వీరి కాళ్లు కడిగి మరీ సన్మానం చేశారు. చంద్రగిరిలోని వైయస్‌ఎంఆర్ కళ్యాణ మండపం ఈ ఘట్టానికి శుక్రవారం వేదికైంది. ఓటు అమ్ముకునే సంస్కృతికి స్వస్తి చెబుతామంటూ ప్రమాణం చేసినవారిని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచన వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం కాళ్లు కడిగి సత్కరించారు. - చంద్రగిరి

ఇదీ మందుల



ఇండిపెండెంట్ బిల్డప్...

సత్యవేడు నియోజకవర్గంలో ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి హంగామా చూసి ఓటర్లు విస్తుపోతున్నారు. విశాఖపట్నానికి చెందిన ఈ ఎన్‌ఆర్‌ఐ ప్రధాన పార్టీ అభ్యర్థి తరహాలో బిల్డప్ ఇస్తుండటంలో అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు. పది మంది బౌన్సర్లు ఈయన్ను అనుసరిస్తుంటే ముసిముసిగా నవ్వుకుంటున్నారు. ముందుగా జన సమీకరణ ఏర్పాట్లు చేయించుకుని మరీ ప్రచారంలో పాల్గొంటున్నారు. అక్కడితో ఆగకుండా తనకు గజమాలలు వేసేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రధాన పార్టీలోని అసమ్మతి నేతలను వెంట బెట్టుకుని చేస్తున్న ప్రచారానికి భారీగానే ఖర్చు పెడుతున్నట్లు సమాచారం. - సత్యవేడు



ముక్కుపుడకా వద్దు బాబోయ్..

శ్రీకాళహస్తిలో ఈసారి ముక్కుపుడక ఫార్ములా పనిచేసేలా లేదు. గత ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు వైసీపీ నాయకులు ముక్కుపుడకలు పంపిణీ చేశారు. ఇవి పూర్తిగా బంగారంతో తయారుచేసినవని అందరూ నమ్మేశారు. ఆ ఎన్నికల్లో మహిళల ఓట్ల గేలానికి ఇది బాగానే వర్కవుట్ అయింది. ఎన్నికలయ్యాక కొంతమంది ఆ ముక్కుపుడకను మార్చుకుందామని బంగారు షాపులకు వెళ్లి భంగపడ్డారు. ఇది బంగారం కాదు..నాశిరకం బంగారం పూత అని తెలియడంతో అవాక్కయ్యారు. చేసేదిలేక ముక్కున వేలేసుకుని వెనక్కు వచ్చేశారు. గతంలో విజయాన్ని అందించిన ముక్కుపుడక తాయిలాన్ని ఈసారి కూడా పంపిణీ చేసేందుకు సదరు నాయకులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఆనోటా ఈనోటా విషయాన్ని తెలుసుకున్న మహిళలు ముక్కుపుడకలంటే ముఖం చిట్లిస్తున్నారు. మరోసారి మోసపోయేదిలేదని వీరంతా చర్చించుకుంటున్నట్లు తెలిసింది. - రేణిగుంట



ఏ మచ్చా.... ఎంతిస్తున్నారు...

రే మచ్చా... ఎంతిస్తున్నార్రా... ఇంతవరకు ఎంతిస్తున్నారో ఎవరూ చెప్పడంలేదురా అని ఒకరంటే... ఇంకా ఒక రోజు ఉందికదా మచ్చా... ఇస్తార్లే..... ఏ ఇంట్లో ఎన్ని ఓట్లు ఉండాయో రాస్తా ఉండాది.. ఈ సంభాషణ ఏ ఇద్దరి మధ్యో జరిగింది కాదు... సూళ్లూరుపేట నియోజకవర్గంలో గ్రామాల్లో ఓటర్లలో విస్తృతంగా జరుగుతున్న చర్చ. పోలింగ్ దగ్గర పడుతుండటంతో ఎవరని కదిపినా డబ్బులు ఎప్పుడు ఇస్తారంటూ మాట్లాడుకుంటున్నారు. ఫలానా చోట వెయ్యిరూపాయలిస్తున్నారంట..రెండు వేలిస్తున్నారంట లాంటి అట కబుర్లే వినిపిస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సమయంలో ఉద్యోగులకు కూడా పార్టీలు డబ్బులిచ్చాయని చర్చించుకుంటున్నారు. ఉద్యోగులకిచ్చినట్టయినా తమకు ఇవ్వకపోరా అనుకుంటున్నారు. - తడ


● నోట్ దిస్ పాయింట్


అభ్యర్థి నేర చరిత్ర తెలుసుకోండి

అభ్యర్థి ఎలాంటివాడో ఓటర్లకు తెలియాలి. నిజమే.. మరి ఎలా తెలుస్తుంది. తాను చాలా సచ్ఛీలుడిననే అందరూ చెబుతారు. అందుకే ఈ విషయంలో ఎన్నికల కమిషనే చొరవ తీసుకుంది. అభ్యర్థి మీద నమోదయిన కేసుల వివరాలన్నీ తెలియజేయాలని గట్టి నిబంధన విధించింది. కేసుల వివరాలు దాస్తే అనర్హత వేటు పడుతుందని స్పష్టం చేసింది. పోలింగుకు రెండు రోజులు ముందుగా కనీసం మూడుసార్లు దినపత్రికల్లో కేసుల వివరాన్నీ ప్రచురించాలని ఆదేశించింది. దీనివల్ల ఓటర్లకు అభ్యర్థుల నేరచరిత్ర తెలిసే అవకాశం ఉంటుందనేది ఎన్నికల కమిషన్ ఉద్దేశం. ప్రస్తుత ఎన్నికలను పరిశీలిస్తే జిల్లాలో ఇద్దరు ఎంపీ, 18మంది అసెంబ్లీ అభ్యర్థులపై క్రిమినల్ కేసులుఉన్నాయని జిల్లా అధికారులు చెబుతున్నారు. అయితే ఓటర్లందరికీ తమ నేరాల చిట్టా తెలియకూడదని కొందరు అభ్యర్థులు ప్రధాన పత్రికలకు కాకుండా మొక్కుబడిగా సర్క్యులేషన్ అంతగాలేని దినపత్రికల్లో ప్రకటనగా ఇస్తున్నారని సమాచారం. - తిరుపతి(కలెక్టరేట్)

ఈసారి ఎన్నికలు బహిష్కరిస్తాం...

ఈసారి ఎన్నికలు బహిష్కరించాలని తొమ్మిది స్వయం సహాయక సంఘాల సభ్యులు భీష్మించుకున్నారు. సత్యవేడు మండలం మల్లవారిపాళెం వెస్ట్ గ్రామానికి చెందిన సుమారు వందమంది డ్వాక్రా మహిళలు ఈమేరకు తీర్మానించుకున్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్‌ను వీరంతా కలసి నిర్ణయాన్ని తెలియజేశారు. ఇరుగుళం గ్రామానికి చెందిన సంఘమిత్ర బాషా తాము చెల్లించిన శ్రీనిధి, సీఐఎఫ్ సొమ్ము రూ.6 లక్షలు స్వాహా చేసినట్లు తేలినా ఎలాంటి చర్యలూ తీసుకోనందునే వీరంతా ఇలా నిర్ణయించుకున్నారు. పైగా దుర్వినియోగమైన సొమ్ము చెల్లించాలంటూ తమకే నోటీసులు రావడంతో డ్వాక్రా సంఘాల సభ్యులంతా అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అందుకే ఈసారి ఆరు నూరయినా..నూరు ఆరయినా ఓటేయరాదని తీర్మానించుకున్నారు. - సత్యవేడు





● అవకాశమున్నా అభివృద్ధి శూన్యం

❓ మీ కుమారుడికి ఓటెందుకెయ్యాలి

తిరుపతి, ఆంధ్రజ్యోతి

నుదుట బొట్టు.. దైవభక్తి..సెంటిమెంట్లు.. గంభీరమైన ఆహార్యం. నిరంతరం తిరుగుతూ ఒక రైతులా రాజకీయాల్లో శ్రమిస్తారు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి. కానుకలతో జనం మనసు గెలుచుకునే వ్యూహాన్ని పదేళ్లుగా అమలు చేస్తున్నారు. వినాయకచవితికి వీధివీధికీ విగ్రహాలు పంచుతారు. దీపావళికి ఇంటింటికీ టపాసులు పంపుతారు. సంక్రాంతికి బ్రాండెడ్ బట్టల సంచులు ఇళ్లకు చేరుస్తారు. గడియారాలు, కుక్కర్లు, క్యాలెండర్లు... ఎన్నికలొచ్చినపుడే గాక ఏడాది పొడవునా ఇలా ఎప్పుడూ ఏదో ఒక కానుక పంపిణీ జరుగుతునే ఉంటుంది. వందల కోట్ల ఖర్చు. ఎక్కడిది ఇంత డబ్బు అనే చర్చ జరుగుతూనే ఉంటుంది. పట్టించుకోరు. సీఎం జగన్‌కు వీరవిధేయ హనుమంతుడిలా ఉండే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనేక పదవులూ అధిష్ఠించారు. ఆ అధికారాన్నీ, సాన్నిహిత్యాన్నీ చంద్రగిరి నియోజవర్గం శాశ్వత అభివృద్ధికి చిటికెడైనా వాడుకోలేదనే ఆరోపణలున్నాయి. తిరుపతిలో కలగలిసిపోయినట్టుగా ఉండే ఈ నియోజకవర్గంలో ఒక్క పరిశ్రమను తీసుకురాలేకపోయారు. ఒక్క ప్రతిష్ఠాత్మక విద్యా, వైద్య సంస్థనూ సాధించలేకపోయారు. వ్యక్తిగత తాయిలాల పంపకంపై పెట్టిన శ్రద్ధ ఆయన అభివృద్ధిమీద వెచ్చించలేదు. జగన్ ఆదేశించారని, తనకు ఏమాత్రం సంబంధం లేని ఒంగోలు నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగి, చంద్రగిరి నుంచి తన కుమారుడు మోహిత్‌రెడ్డిని పోటీ చేయిస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండీ చేసిందేమిటనే ప్రశ్నకు బలమైన సమాధాన సాక్ష్యాలు లేవు. ఎన్నికలవేళ ఇప్పుడు అవే చర్చగా మారాయి. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఓటెందుకు వేయాలనే ప్రశ్న చంద్రగిరి నియోజకవర్గంలో వినిపిస్తోంది.

● ఆప్యాయంగా పలకరిస్తారు .. మెత్తగా అణచేస్తారు
● ఇసుక, గ్రావెల్ తవ్వకాలతో అనుచరుల అక్రమార్జన

పంపకాలు తప్ప పనేం చేశారు చెవిరెడ్డీ?

చంద్రగిరి ప్రజల చెవిలో చెవిరెడ్డి పూలు



హామీ : చంద్రగిరిలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయిస్తా!
అమలు: టీడీపీ ప్రభుత్వం 2018లో ఏర్పాటు చేసిన 50 పడకల ఆస్పత్రే ఇప్పటికీ కొనసాగుతోంది.
హామీ: చంద్రగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సదుపాయం కల్పిస్తా!
అమలు: కనీసం ప్రతిపాదనలు కూడా రూపొందించలేదు.
హామీ: చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తా!
అమలు: క్రికెట్ స్టేడియం నిర్మించకపోగా, టీడీపీ ప్రభుత్వంలో మొదలైన ఇండోర్ స్టేడియం పనులు కూడా పూర్తి చేయించలేదు.
హామీ: కళ్యాణి డ్యామ్ జలాలతో చంద్రగిరికి, తిరుపతి రూరల్ గ్రామాలకు తాగునీరు అందిస్తా!
అమలు: ప్రతిపాదనలు కూడా తయారు కాలేదు.
హామీ: శేషాచలం అటవీ సరిహద్దుల్లోని పొలాల్లోకి ఏనుగులు రాకుండా కందకాలు, సోలార్ పవర్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తా!
అమలు: కందకాల తవ్వకం గానీ, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు గానీ కాలేదు. ఏనుగుల బెడదతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.
హామీ: ప్రతి గ్రామంలో ప్యూరిఫైడ్ తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేయిస్తా!
అమలు: తుడా నిధులతో కొన్ని గ్రామాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేయించినా చాలా వరకూ అవి పనిచేయడం లేదు. పైగా టీడీపీ పాలనలోని ఎన్టీయార్ సుజల పథకం కింద ఏర్పాటు చేసిన ప్లాంట్లను మరమ్మతు చేయించకుండా నిర్వీర్యం చేశారు.
హామీ:పాకాల మండలం నేంద్రగుంట-దామలచెరువు రోడ్డు విస్తరణ చేయిస్తా!
అమలు:విస్తరణ జరగలేదు. కనీసం ఉన్న రోడ్డుకు మరమత్తులు కూడా చేయలేదు.
హామీ: భాకరాపేట నుంచి తలకోన వరకు రోడ్డు విస్తరణ చేయిస్తా!
అమలు: నెరవేరలేదు.
హామీ: తిరుచానూరు బస్టాండు ఏర్పాటు చేస్తా!
అమలు: ఆ ఊసే లేదు.

పవర్ ఉండీ ప్రగతి శూన్యం

చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డికి అవకాశమున్నా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. వైపీపీ ప్రభుత్వంలో చెవిరెడ్డికి ప్రభుత్వ విప్‌గానూ, తుడా ఛైర్మన్‌గానూ క్యాబినెట్ హోదా వున్న రెండు నామినేటెడ్ పదవులు దక్కాయి. టీటీడీ పాలకమండలిలో ఎక్స్ అఫిషియో సభ్యుడు కూడా అయ్యారు. సీఎం జగన్‌కు ఆంతరంగిక సన్నిహితుడుగా పేరుపొందారు. అయినా చంద్రగిరి అభివృద్ధి కోసం ఆయన చేసింది ఏమీలేదు. నియోజకవర్గానికి ఒక పరిశ్రమ గానీ, ఉన్నత విద్యా, వైద్య సంస్థలు గానీ తెప్పించుకోలేకపోయారు.

ఆరోపణలు అపారం

● ఎమ్మెల్యే చెవిరెడ్డి అండతో అనుచరులు, కుటుంబీకులు నియోజకవర్గవ్యాప్తంగా భూ ఆక్రమణలు, సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారని, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో భారీ ఎత్తున గ్రావెల్ అక్రమ తవ్వకాలకు తెగబడుతున్నారని ఆరోపణలున్నాయి.

● తిరుపతి రూరల్, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో మఠాలకు చెందిన వందలాది ఎకరాలు ఆక్రమించారని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు.

● హథీరాంజీ మఠానికి చెందిన అత్యంత ఖరీదైన భూములను తన కుటుంబ సభ్యులు, బినామీల పేరిట తమ ఆధీనంలో ఉంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.తుమ్మలగుంటలో తొలుత ఓ గ్రామదేవత పేరిట డెయిరీ అంటూ బోర్డు పెట్టారని, ఇటీవల దాన్ని కూడా పీకించేసి భూమిని సొంతం చేసుకున్నట్టు స్థానిక జనం చెప్పుకుంటున్నారు.

● తుడా లేఅవుట్లలో పార్కుల కోసం కేటాయించిన ఖరీదైన స్థలాలను కూడా అనుచరులు కాజేశారనే ఆరోపణలున్నాయి. ● తుమ్మలగుంట చెరువును ఆక్రమించారని, ఆ స్థలాల విలువ వందల కోట్లుంటుందని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు.

● ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సోదరుడు నియోజకవర్గం మొత్తం మీద టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులను గ్రూపుగా చేసి ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాకు రింగ్ లీడర్‌గా వ్యవహరిస్తూ భారీగా అక్రమార్జనకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో ప్రవహించే స్వర్ణముఖి నదిలో ఇసుక కొల్లగొట్టి వందల కోట్లు పోగేసుకున్నారనే ఆరోపణలున్నాయి.

● అనధికార అపార్టుమెంట్లు, అనధికారిక లేఅవుట్ల యజమానుల నుంచి ఎమ్మెల్యే సోదరుడు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

● శ్రీవారి దర్శనాలను సైతం దుర్వినియోగం చేస్తున్నారని, పారిశ్రామికవేత్తలకు, వ్యాపారవేత్తలకు, ఎన్‌ఆర్‌ఐలకు దర్శనాలు చేయించి ప్రయోజనాలు పొందుతుంటారనే ఆరోపణలున్నాయి.

'జగనన్నతోడు'గా అర్హులకేదీ సాయం

చిరు వ్యాపారులకు అండగా నిలవాల్సిన జగనన్నతోడు పథకం అభాసుపాలవుతోంది. పథకం అమలుకు సంబంధించి జగన్ ప్రభుత్వం చెబుతున్నవి కాకిలెక్కలేనని తేలుతోంది. అసలైన అర్హుల్లో కొందరికే లబ్ధి చేకూరుతోందని చిరువర్తకులు మండిపడుతున్నారు. అధికారపార్టీ నాయకులకు నచ్చినవారికే ఈ పథకం వర్తిస్తోందనే విమర్శలున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



అర్జీలిచ్చినా పట్టించుకోలేదు



20 ఏళ్లుగా చెక్కబండిపై పండ్ల వ్యాపారం చేస్తున్నా. ఈ ప్రభుత్వం గుర్తింపుకార్డు అయితే ఇచ్చింది గానీ జగనన్నతోడు డబ్బులు మాత్రం ఇవ్వలేదు. చాలాసార్లు సచివాలయంలో అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదు. ఇక్కడ వ్యాపారం చేస్తున్న వారిలో ఇద్దరికో ముగ్గురికో వచ్చింది.
- మంజుల,తిరుపతి

అప్పు చేసి పెట్టుబడి పెడుతున్నాం



ఎలాంటి షూరిటీ లేకుండా, వడ్డీ లేకుండా రూ.10 వేలు అప్పు ఇస్తున్నారంటే సంతోషించాం. తొమ్మిదేళ్లుగా అప్పు చేసి పెట్టుబడి పెట్టి వ్యాపారాలు చేస్తున్నా. లాభంలో సగాన్ని వడ్డీకి కట్టి మిగిలిన దాంట్లో తింటున్నాం. ఐడీ కార్డులు ఇవ్వలేదు, జగనన్న తోడు ఇవ్వలేదు.
- వీణ,తిరుపతి



మోసం గురూ!

వీధుల్లో, తోపుడు బండ్లపై చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారికి జగనన్న తోడు పథకం ద్వారా అండగా నిలుస్తామంటూ జగన్ ప్రభుత్వం ప్రకటించింది. వారు తీసుకునే రూ.10 వేలు బ్యాంకు రుణానికి ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుందని పేర్కొంది. ఈ పథకం కింద 16.73 లక్షల మందికి రూ.3,373 కోట్ల రుణాలు ఇప్పించామని గొప్పలు చెప్పుకుంటోంది. జిల్లాలో ఈఏడాది జనవరిలో ఎనిమిదో విడతగా 16,541 మందికి రూ.17.50 కోట్లు, గతంలో రుణాలు తీసుకున్న 30,782 మంది చిరువ్యాపారులకు సుమారు రూ.70.71 లక్షలు వడ్డీ రీయింబర్స్‌మెంట్ చేసినట్లు లెక్కలు చూపుతోంది.



తిరుపతి రోడ్ల ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారులు

అర్హులు 15 శాతం మాత్రమే

వాస్తవానికి చిరు వ్యాపారుల్లో కొద్దిమందికి మాత్రమే జగనన్న తోడు అందుతోంది. మొక్కుబడిగానే వడ్డీ చెల్లిస్తున్నారని లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. తిరుపతి లో ఈ పథకం అమలుపై 'ఆంధ్రజ్యోతి' సర్వే చేస్తే 15 శాతం మంది మాత్రమే తమకు జగనన్నతోడు లభించిందన్నారు. అర్జీలు పెట్టుకుంటునే ఉన్నా తమను పథకంలో చేర్చడంలేదని కొంతమంది అర్హులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ వడ్డీకి అప్పు తెచ్చి వ్యాపారాలు చేస్తునామంటూ వాపోయారు. అర్హులు కాకపోయినా అధికారపార్టీ వైసీపీ నేతలు సిఫారసు చేసినవారినే లబ్ధిదారులుగా చేర్చారనే ఆరోపణలున్నాయి. అర్హులెవరూ పెద్దగా లబ్ధి పొందకపోయినా ప్రభుత్వం మాత్రం లేనిపోని గణాంకాలతో గొప్పలు చెప్పుకొంటోంది. గుర్తింపుకార్డులు ఇస్తామంటూ వైసీపీ ప్రభుత్వం తమను మోసగించిందని చిరువ్యాపారులు ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు.

నాలాగ ఎందరో..

● దళిత మహిళ గాలి కృష్ణవేణి ఆవేదన



వైసీపీ పాలనలో దళితులను అడుగడుగునా అణచివేశారని ఏర్పేడు అశోక్‌నగర్‌కు చెందిన దళిత మహిళ గాలి కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేసింది. తానెదుర్కొన్న కష్టాన్ని ఆమె వివరించిందిలా.. కంచర్ల శ్రీకాంత్ ఎమ్మెల్సీగా గెలిచిన సమయంలో ఏర్పేడు అంబేడ్కర్ విగ్రహం వద్ద కొందరు మహిళలతో కలసి సంబరాలు చేసుకుంటున్నాం. ఓర్వలేని అప్పటి సీఐ శ్రీహరి అసభ్య పదజాలంతో, కులంపేరుతో దూషించారు. భర్తలేని నిన్ను పట్టుకుని ఈడ్చి తన్నితే దిక్కెవరన్నారు. అవమానం దిగమింగుకుని సీఐపై చర్యలు తీసుకోవాలని చాలాసార్లు రేణిగుంట డీఎస్పీని కలిశాను. ఆయన స్పందించలేదు. గతేడాది మే 15న కోర్టును ఆశ్రయించాను. విచారించిన కోర్టు శ్రీహరిపై చర్యలు తీసుకోవాని డీఎస్పీ భవ్య కిషోర్‌ను ఆదేశించింది. ఈక్రమంలో సీఐ శ్రీహరిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదయింది. తనలా ఎంతోమంది దళితులను వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా అవమానించిందని కృష్ణవేణి పేర్కొంది. మహిళలు సగర్వంగా తలెత్తుకోవాలన్నా, ఉన్నతంగా ఎదగాలన్నా చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని ఆమె ఆకాంక్షించింది. మహిళలు ఏకమై టీడీపీని గెలిపించాలని ఆమె కోరింది. - ఏర్పేడు

బైక్ బోల్తా

ఇద్దరు చిల్లకూరు యువకుల దుర్మరణం



ప్రమాదస్థలంలో వేణు మృతదేహం - తీవ్ర గాయాలతో చల్లా ఆకాష్ - వేణు, ఆకాష్ (ఫైల్‌ఫొటోలు)

పెళ్లకూరు, మే 10: చెన్నై- కోల్‌కతా జాతీయరహదారిపై నెల్లూరు జిల్లా మనుబోలు పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బండి వేణు(19), చల్లా ఆకాష్(20) దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చిల్లకూరుకి చెందిన బండి చంద్రయ్యకు ఇద్దరు పిల్లలు. ఆయన కూలీ చేసుకుంటూ జీవిస్తున్నాడు. కుమారుడు వేణు ఇటీవల ఇంటర్ పూర్తిచేశాడు. నాలుగురోజుల క్రితం కుమారుడికి సెకండ్ హ్యాండ్ బైక్ కొనిచ్చాడు. బైక్‌కు కట్టాల్సిన డబ్బులు, పేరు మార్పు కోసం వేణు చిల్లకూరుకి చెందిన తన స్నేహితుడు చల్లా ఆకాష్‌ను తీసుకుని నెల్లూరుకి వచ్చాడు. పని కాకపోవడంతో మధ్యాహ్నం 2గంటల సమయంలో నెల్లూరు నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మనుబోలు వద్ద ముందు వెళుతున్న లారీని అధిగమించబోయి సర్వీసురోడ్డు స్టాఫ్‌బోర్డును ఢీకొని బైక్ బోల్తా పడింది. ప్రమాద స్థలంలోనే తల ఛిద్రమై వేణు మృతి చెందాడు. ఆకాష్ తీవ్రగాయాలతో రోదిస్తుండగా 108 అంబులెన్స్‌లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆకాష్ కూడా మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మనుబోలు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. రెండు కుటుంబాల్లో ఒక్కగానొక్క కుమారులు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. యువకుల మృతితో చిల్లకూరు వడ్డిపాళెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి: టీడీపీ



మోకాళ్లపై టీడీపీ నాయకుల నిరసన

నాయుడుపేట, మే 10: వైసీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని టీడీపీ నాయకులు శుక్రవారం నాయుడుపేట తహసీల్దారు కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. భూ యాజమాన్యం చట్టం 2022లో పలు ప్రతిపాదనలు రైతులకు, ప్రజలకు చేటు కల్పించేవిగా ఉన్నాయన్నారు. వారసత్వం నుంచి వచ్చిన ఆస్తులు, కొనుగోలు చేసిన ఆస్తులకు ముప్పు వాటిల్లేలా, వాటిని అన్యాక్రాంతం చేసుకునేలా ఉన్నాయన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కె.అశోక్‌రెడ్డి, పి.రత్నం, నవీన్, పరంధామయ్య, బాబు, వెంకటరత్నం, ప్రసాద్, జనార్దనరెడ్డి, సుబ్బరాయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు ఇవ్వకపోవడంతో తటస్థంగా ఉన్నాం

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కల్పలత దంపతులు

గూడూరు అర్బన్, మే 10: వైసీపీ అభ్యర్థి తమకు గుర్తింపు ఇవ్వకపోవడంతో ఈ ఎన్నికల్లో తటస్థంగా ఉన్నామని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కె.కల్పలత, వైసీపీ నాయకుడు కె.మీరా రెడ్డి తెలిపారు. శుక్రవారం మీరారెడ్డి నివాసంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడు తూ... వైఎస్ అభిమానులుగా తాము రాజకీయాల్లో ఉన్నామన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ విజయానికి తమవంతు కృషి చేశామన్నారు. అయితే ఈ ఎన్నికల్లో కొంతమంది తమను పార్టీకి దూరం చేసేలా ప్రవర్తించడంతో ఆత్మాభిమానాన్ని చంపుకోలేక ప్రచారం చేయలేక పోయామన్నారు.

అరాచక వైసీపీని ఇంటికి సాగనంపండి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి పిలుపు



ప్రచార వాహనంలో వాకాటి, గంగాప్రసాద్, అభ్యర్థి విజయశ్రీ - ర్యాలీకి హాజరైన అభిమానులు

సూళ్లూరుపేట/ ఓజిలి: మే 10: వైసీపీ హయాంలో అరాచకం రాజ్యమేలుతోందని ఆ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు నుంచి బజారు వీధుల్లో ర్యాలీ జరిగింది. టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకాటి మాట్లాడుతూ... దోచుకోవడమే వైసీపీకి సిద్ధాంతంగా మారిందని విమర్శించారు. అమాయక ప్రజలకు కుడిచేతితో పది రూపాయలు ఇచ్చి 100 రూపాయలు లాగేసుకుంటున్నారని టీడీపీ నేత గంగాప్రసాద్ అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ద్వారా పేదల భూములకు ఎసురు పెట్టేందుకు ఈ ప్రభుత్వం జీవో తేవడం దుర్మార్గమని మాజీ ఎంపీ నెలవల విమర్శించారు. బుకాయింపు మాటలతో మరోసారి తమకు అధికారం ఇవ్వాలంటూ వైసీపీ నేతలు ముందుకొస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండకపోతే రాష్ట్రాన్ని అమ్మేస్తారన్నారు. ఒక చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని పరసా విమర్శించారు. జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ నాయకులు ఎ.విజయభాస్కర్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, ఆర్.కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు టి.సుధాకర్ రెడ్డి, చిట్టేటి పెరుమాల్, టి.శ్రీనివాసులు రెడ్డి, ఎ.రమేష్, ఏ.జీ.కిషోర్, ఎం.వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: నెలవల



మనవాలిలో ప్రచారం చేస్తున్న నెలవల

రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న, పేదలపై భారం పడకుండా అన్ని సంక్షేమ పథకాలు అందాలన్న టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఓజిలి మండలం మనవాలి పంచాయతీలో సూపర్ సిక్స్‌తో పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ రూ.4వేలు ఇంటికే తెచ్చిఇస్తారన్నారు. విజయకుమార్ నాయుడు, శ్రీనివాసులురెడ్డి, మధుసూదన రెడ్డి, గోపాల్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, సత్యవరప్రసాద్ రావు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా నిలిపి వేశారంటూ వైసీపీ నాయకుడిపై దళితుల ఆగ్రహం

నాలుగు గంటలపాటు రోడ్డుకు అడ్డంగా బైఠాయింపు ● భారీగా నిలిచిపోయిన వాహనాలు



బిందెలు, క్యాన్లతో మల్లాం ఎస్సీ కాలనీవాసుల ధర్నా

చిట్టమూరు, మే 10: అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు తాగునీటి సరఫరా నిలిపివేశాడంటూ మండలంలోని మల్లాం గ్రామానికి చెందిన దళితులు రోడెక్కారు. దామరాయిగుంట జంక్షన్ వద్ద బిందెలతో మల్లాం, నాయుడుపేట, కోట మార్గాలను స్తంభింపచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వాకాడు స్వర్ణముఖి నది నుంచి మల్లాం దళితవాడ, అరుంధతివాడలకు నీరు సరఫరా అయ్యేదన్నారు. కొద్దిరోజుల క్రితం తమకు తాగు నీరు సరఫరా అయ్యే గేట్‌వాల్వును వైసీపీ నాయకుడు కట్ చేయించాడన్నారు. ఆ నీటిని వాటర్ ప్లాంట్లకు విక్రయిస్తున్నాడన్నారు. అదే సమయంలో ఉప్పునీటిని సరఫరా చేస్తున్నారన్నారు. దీనిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. సుమారు 4గంటల పాటు ఆందోళన చేయడంతో రహదారులు స్తంభించిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ చిన్న బలరామయ్య, ఎంపీడీవో నాగరాజు, ఈవోపీఆర్‌డీ మనోహర్‌గౌడ్, కార్యదర్శి వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని అధికారుల హామీ మేరకు గ్రామస్తులు ఆందోళన విరమించారు.

నేటితో ప్రచారానికి తెర

తిరుపతి(కలెక్టరేట్), మే 10: ఎన్నికల ప్రచారానికి శనివారం సాయంత్రం 6గంటలకు తెరపడనుంది. ఆ తర్వాత ఎవరైనా బహిరంగ సభలు, ప్రచారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎన్నికల సంఘం తెలిపింది. సోషల్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఎగ్జిట్ పోల్స్‌పైనా నిషేధం విధించారు. పార్లమెంటు స్థానానికి 23మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 133మంది కలిపి 156 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 2,140 పోలింగ్ కేంద్రాలకుగాను 1,401 చోట్ల వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాటు చేస్తున్నారు. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో మాత్రం అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్‌కాస్టింగ్ ఉంటుంది. సూళ్లూరుపేటలో 150, గూడూరు 147, వెంకటగిరి 149, శ్రీకాళహస్తి 139, సత్యవేడు 139 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. 14,759 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో ఉండనున్నారు. శనివారం సాయంత్రం ఏడు నుంచి 13వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లు మూసివేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచే స్ట్రాంగ్ రూంల నుంచి పోలింగ్ సామగ్రిని ఆర్వోలు, ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేస్తారు. సోమవారం జరిగే పోలింగ్ ప్రక్రియను పరిశీలించేలా కలెక్టరేట్‌లో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఇక్కడినుంచే అబ్జర్వర్లు, కలెక్టర్, ఎస్పీ తదితరులు పరిశీలించనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, డీఐజీ బాజాపాయ్, డీఆర్వో పెంచలకిషోర్ సమీక్షించారు.

నిమ్మ మార్కెట్‌కు మూడురోజులు సెలవు

గూడూరు అర్బన్, మే 10: నిమ్మ మార్కెట్‌కు మూడు రోజులు సెలవు ప్రకటించారు. ఎన్నికల నేపథ్యంలో సోమ, మంగళవారాలు సెలవు దినాలుగా నిమ్మ వ్యాపారులు ప్రకటించగా బుధవారం సాధారణ సెలవు దినం కావడంతో వరసగా మూడు రోజులు మార్కెట్ మూత పడనుంది.

కూటమిదే గెలుపు, ధర్మానిదే విజయం

తిరుపతి కోర్టు ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రచారం



వాకాడు మండల నాయకులతో వరప్రసాద్ - కోర్టు ప్రాంగణంలో లక్ష్మితో కలసి సుగుణమ్మ ప్రచారం

తిరుపతి, మే10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిదే గెలుపు, ధర్మానిదే విజయమని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ స్పష్టం చేశారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు సతీమణి లక్ష్మీతో కలసి సుగుణమ్మ ప్రచారం చేపట్టారు. న్యాయవాదులను పేరుపేరున పలకరించి ఎంపీ అభ్యర్థికి కమలం గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థికి గాజుగ్లాసు గుర్తుపై ఓటువేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు. టీడీపీ నగర అధ్యక్షుడు చినబాబు, లీగల్‌సెల్ నాయకులు దినకర్, వేణుగోపాల్, వసుమతి, బుల్లెట్ రమణలు పాల్గొన్నారు. అలిపిరిలో బీజేపీ ఇంటింటా ప్రచారం, రోడ్‌షో నిర్వహించింది. తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు సతీమణి కొల్లూరి లక్ష్మి, కుమార్తె డాక్టర్ స్ఫూర్తి ప్రచారంలో పాల్గొని ఎన్డీఏ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

పొదలకూరు/వాకాడు:ప్రజల స్పందన చూస్తుంటే ఎన్డీఏ కూటమిదే ఘన విజయమని తెలుస్తోందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం పొదలకూరులో సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలసి ఎన్నికల ప్రచార ర్యాలీలోపాల్గొన్నారు. దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించే ఈ పార్టీని ప్రజలు భూస్థాపితం చేసేరోజు వచ్చిందన్నారు. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి వనరుల దోపిడీకి ప్రాధాన్యం ఇచ్చి దానిని ప్రశ్నించిన తనను అవమానకరరీతిలో బయటకు పంపారన్నారు. వాకాడు మండల టీడీపీ, బీజేపీ నాయకులతో వరప్రసాద్ సమాలోచనలు జరిపారు. అధికార వైసీపీ ప్రలోభాలకు ప్రజలు గురికాకుండా వారికి వాస్తవ పరిస్థితులు వివరించి ఎన్డీఏ అభ్యర్థులకు ఓట్లు వేసేలా అందరూ కృషి చేయాలని కోరారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో భూముల దోపిడీకి వైసీపీ సిద్ధం: కురుగొండ్ల



కలువాయిలో ఓట్లు అభ్యర్థిస్తున్న టీడీపీ అభ్యర్థి రామకృష్ణ - అక్కంపేట సభలో మాట్లాడుతున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి/ డక్కిలి, మే 10: ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమల్లోకి వస్తే రైతులు వంశపారంపర్యంగా వచ్చిన భూములను వైసీపీ నేతలు కబ్జా చేస్తారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం కలువాయిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ల్యాండ్ టైట్లింగ్ చట్టం ఈ ఎన్నికల్లో జగన్ మెడకు ఉరితాడై బిగుసుకోవడం ఖాయమని చెప్పారు. ఈ ఎన్నికల్లో కూటమిదే విజయమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం కాగానే జగన్ తెచ్చిన నల్ల చట్టాన్ని రద్దు చేస్తామని ఇదివరకే ప్రకటించారన్నారు. వైసీపీ నేతలు డబ్బు సంచులతో ఓట్లు కొనేందుకు వస్తారని వారి ప్రలోభాలకు లొంగవద్దన్నారు. వెంకటేశ్వర్లు, చల్లా ఇందిర, రఘురామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జి.కిషోర్, వెంకటేశ్వర్లునాయుడు, జగదల్‌నాయుడు, కె. శ్రీనివాసులు నాయుడు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు పాల్గొన్నారు. కాగా కామకూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతల వెంకటేశ్వర్లుకు కురుగొండ్ల కండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.

టీడీపీలో యువత, మహిళలకు పెద్దపీట

టీడీపీలో యువతకు మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయిప్రియ అన్నారు. శుక్రవారం ఆమె రాపూరు మండలం చానాయపాళెం, బాలాయపల్లి మండలం అక్కంపేటల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తన తండ్రి కురుగొండ్ల రామకృష్ణను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే రాపూరు పట్టణాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కె.శ్రీనివాసులు నాయుడు, టీడీపీ నాయకులు సి.సి. నాయుడు, వి.యువరాజ్, రాములు, చెన్ను తిరుపాల్ రెడ్డి, పి.వెంకటరెడ్డి, టి. నరసింహప్రసాద్, జగంనాయుడు, చెన్ను అశోక్‌రెడ్డి, భాస్కరరెడ్డి, ఎన్.శివరామకృష్ణ, రమేష్, వెంకటయ్య, శ్రీనివాసులు, సత్యం, శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

వెంకటగిరికి రింగ్ రోడ్డు నిర్మాణం



మేనిఫెస్టో వివరాలను ప్రకటిస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరిలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని రింగ్ రోడ్డు నిర్మిస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన తన నివాసంలో సొంత మేనిఫెస్టోని విడుదల చేశారు.

- మండల కేంద్రాల్లో బీసీ, అంబేడ్కర్ భవనాల నిర్మాణం
- అల్తూరుపాడు రిజర్వాయరు, సోమశిల స్వర్ణముఖి కాలువ నిర్మాణం
- సోమశిల-కండలేరు పెండింగ్ పనుల పూర్తి, రైతులకు సాగునీరు
- తెలుగుగంగ కాలువకు తూముల ఏర్పాటు
- వెంకటగిరిలో మరో సమ్మర్ స్టోరేజిట్యాంకు నిర్మాణం
- ఎర్రబల్లి ట్యాంకు ఆధునికీకరణ
- వెంకటగిరిలో 100 పడకల ఆసుపత్రి, డయాలసిస్ సెంటర్
- గోషా ఆసుపత్రికి పూర్వ వైభవం

ఓటర్లకు నగదు పంపకాల్లో వైసీపీ జోరు

తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో శుక్రవారం సైతం ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమాలు కొనసాగాయి. శ్రీకాళహస్తి పట్టణంలో వైసీపీ నేతలు ఇప్పటికే ఓటుకు రూ. 3 వేలు, మిగిలిన చోట్ల రూ. 2 వేల వంతున 80 శాతం మంది ఓటర్లకు పంచేశారు. టీడీపీ సానుభూతిపరులకు సైతం నగదు పంపిణీ చేసి వారి ఇళ్లలోని ఓట్లలో కనీసం సగమైనా వేయండని బతిమాలారు. చీరల పంపిణీ ప్రారంభించినా సక్రమంగా చేరలేదని, నాసిరకంగా వున్నాయని ఫిర్యాదులు రావడంతో పంపిణీ ఆపేశారు. ప్రత్యామ్నాయంగా మహిళలకు బంగారు ముక్కు పుడకలు, వెండి మెట్టెలు పంపిణీ చేస్తున్నారు. అయితే వీటిని ఓటర్లకు అందరికీ కాకుండా పేదవర్గాలున్న చోట్ల ఎక్కువగా ఇస్తున్నారు. ఇక టీడీపీ వర్గీయులు పట్టణంలో ఓటుకు రూ.2 వేల, ఇతర చోట్ల రూ. 1500 చొప్పున 70 శాతం మందికి పంపిణీ చేసినట్టు చెబుతున్నారు. వెంకటగిరిలో వైసీపీ వర్గీయులు గరిష్ఠంగా ఓటుకు రూ.3500 చొప్పున శుక్రవారం సాయంత్రం నుంచీ పంపకాలు ప్రారంభించారు. టీడీపీ వర్గీయులు ఇంకా మొదలు పెట్టలేదు.వైసీపీ వర్గీయులు గూడూరు పట్టణంలో ఓటుకు రూ.2 వేలు, మిగిలిన చోట్ల రూ.1500 చొప్పున ఇస్తున్నారు. టీడీపీ వర్గీయులు మాత్రం ఓటుకు రూ. వెయ్యి వంతున పంపిణీ చేస్తున్నారు. సూళ్ళూరుపేటలో ఇరు పార్టీలకు చెందిన వారూ ఓటుకు రూ. వెయ్యి చొప్పున అందజేస్తున్నారు. సత్యవేడులో టీడీపీ వర్గీయులు శుక్రవారం పంపిణీ మొదలుపెట్టి ఓటుకు రూ. వెయ్యి చొప్పున ఇస్తున్నారు. దాదాపు వంద శాతం ఓటర్లకు చేర్చాలని నిర్ణయించినట్టు సమాచారం. వైసీపీ వర్గీయులు మాత్రం ఓటుకు రూ.1500 చొప్పున 80 శాతం మందికి చేర్చేశారని చెబుతున్నారు.చంద్రగిరిలో టీడీపీ వర్గీయులు ఓటుకు రూ.2 వేల వంతున 99 శాతం పంపిణీ పూర్తి చేశారని సమాచారం. అయితే వైసీపీ వర్గీయులు కూడా రూ.2 వేల వంతున ఇచ్చినా 70శాతం మందికే ఇచ్చారని చెబుతున్నారు. మంగళం ప్రాంతంలో కవర్‌లో రూ.2 వేలు పెట్టినట్టు చెప్పి ఓటర్లకు అందజేయగా పలు కవర్లలో రూ.2 వేలకు బదులు వెయ్యి మాత్రమే వుండడం చూసి ఓటర్లు ఖంగుతిన్నారని సమాచారం. దీంతో వారు పంపిణీ చేసిన నేతలతో గొడవకు దిగినట్టు తెలిసింది. కాగా వైసీపీ వర్గీయులు ఈ నియోజకవర్గంలో రెండో విడత ఇంటింటికీ రూ.3 వేలు చొప్పున అందిచేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. తిరుపతిలో ఇరుపార్టీలూ పంపిణీ ప్రక్రియ పూర్తి చేసినట్టు తెలిసింది.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

చిల్లకూరు, మే 10: మండలంలోని బూదనం గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితుడు రమణయ్యకు వైద్యఖర్చుల నిమిత్తం చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు రూ.25వేలు సాయం చేశారు.

పంపిణీకి ఈవీఎం, వీవీపాట్‌లు సిద్ధం

వెంకటగిరి టౌన్, మే 10: ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎం, వీవీపాట్ల పంపిణీకి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. పట్టణంలోని ఏపీఆర్ఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూం నుంచి అధికారులకు ఆదివారం మధ్యాహ్నం నుంచి పంపిణీ చేయనున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 48 రూట్‌లలో ఆర్టీసీ బస్సుల్లో తరలించనున్నారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి ఓటింగ్ ప్రారంభం అవుతుంది.

మద్యం షాపులు కిటకిట

గూడూరు, మే 10: ఎన్నికల నిబంధనల పుణ్యమా అని మద్యంషాపులు శుక్రవారం కిటకిటలాడాయి. శనివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు షాపులు మూతపడనుండడంతో ముందుజాగ్రత్తగా మద్యాన్ని నిల్వ చేసుకునేందుకు మందుబాబులు ఎగబడడంతో గూడూరులోని అన్నీ కిక్కిరిసిపోయాయి.

టీడీపీ అధికారంలోకి రాగానే ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు

టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్



విద్యానగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ - అశోక్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జశ్వంత్‌కుమార్

కోట, మే 10: టీడీపీ అధికారంలోకి రాగానే వైసీపీ అక్రమంగా తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని చంద్రబాబు రద్దు చేసి ప్రజల ఆస్తులకు భరోసాగా నిలుస్తారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని విద్యానగర్‌లో ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను అమలు చేయలేదన్నారు. ప్రజల భూములను కబ్జా చేసేందుకే జగన్ ప్రభుత్వం ఆ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ల్యాండ్, శాండ్, మైనింగ్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్‌బియ్యం కొల్లగొట్టడం ద్వారా వైసీపీ పెద్దలు రూ.8లక్షల కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. ఈ పాపపు సొమ్మును భూముల్లోకి తరలించడడానికి సివిల్ కోర్టులు అడ్డంగా ఉన్నాయని, రెవెన్యూ అధికారులకు సివిల్‌కోర్టుల అధికారాన్ని కట్టబెడుతూ చట్టం తీసుకువచ్చారన్నారు. భూములకు రక్షణ ఉండాలంటే టీడీపీకి ఓటు వేసి చంద్రబాబును సీఎం చేసుకోవాలన్నారు. కూటమిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైసీపీని ఓడించి, జగన్‌ను ఇంటికి పంపి టీడీపీని గెలిపించుకుని భూ హక్కులను కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

ప్రజలందరూ టీడీపీ వెంటే

గూడూరు: గూడూరు నియోజకవర్గ ప్రజలందరూ టీడీపీ వెంటే ఉన్నారని టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ తనయుడు డాక్టర్ జశ్వంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అశోక్‌నగర్ ప్రాంతంలో ఉమ్మడికూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ రాక్షసపాలనను అంతమొందించి చంద్రన్న సుపరిపాలనకు స్వాగతం పలికేలా ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. స్థానికుడు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేవాడైనా పాశం సునీల్‌కుమార్‌కు సైకిల్‌గుర్తుపై ఓటువేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో గురువయ్య, శ్రీకాంత్, జీవన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.